# పెన్ పవర్

12 YEARS PEN POWER JOURNEY 2014 - 2026 ప్రశ్నించడం మన హక్కు

విశాఖపట్నం | హైదరాబాద్ | ఉభయ గోదావరి | ఎన్. టి. ఆర్ | గుంటూరు | ప్రకాశం | నెల్లూరు | తిరుపతి | చిత్తూరు | కడప

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు

సంపుటి : 2 సంచిక : 40 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : ఒంగోలు బుధవారం 14 అక్టోబర్ 2026 వెల : 1/-రూ ॥

VOLUME :2 ISSUE :40 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : ONGOLE WED 14 OCTOBER 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Ongole,Visakhapatnam,Kakinada,Bapatla,Narasarao Peta, YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur




## ఏపీలో స్థానిక ఎన్నికలకు నేడు షెడ్యూల్ విడుదల

- ఏపీలో స్థానిక సమరానికి మోగిన నగారా!
- మూడు దశల్లో ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు!
- తొలి విడతలో మున్సిపల్ ఎన్నికలు
- విజయవాడలో బుధవారం మీడియా సమావేశం ఏర్పాటు

- మిగతా 2లో

## ఏపీ మహిళా కమిషన్ సభ్యురాలిగా 'స్వాతిరెడ్డి' నియామకం

- ఆంధ్రప్రదేశ్ మహిళా కమిషన్ సభ్యురాలిగా 'స్వాతిరెడ్డి'
- ఆమె నియామకంపై రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ
- గత ఎన్నికల ముందు సోషల్ మీడియాలో వేధింపులు ఎదుర్కొన్న స్వాతిరెడ్డి
- కష్టకాలంలో పార్టీకి అండగా నిలిచినందుకు టీడీపీ ప్రభుత్వంలో గుర్తింపు

- మిగతా 2లో



## దళపతి విజయ్ రాకతో విజయవాడ దద్దరిల్లింది

- బెజవాడలో విజయవాడ ఉత్సవ్ 2.0 కార్యక్రమం
- ఒకే వేదికపై ఏపీ సీఎం చంద్రబాబు, తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్
- యువత ఉత్సాహాన్ని చూసి పులకించిన చంద్రబాబు
- విజయవాడ ఉత్సవాల వేదికగా గోదావరి-కావేరి నదుల అనుసంధానంపై కీలక ప్రకటన
- ప్రధాని మోదీ నాయకత్వంలోనే ఐదు నదుల అనుసంధానం సాధ్యమని వెల్లడి
- యువత ఉత్సాహం చూస్తుంటే 2047 నాటికి భారత్ నంబర్ వన్‌గా నిలుస్తుందని ధీమా
- రాష్ట్రాలు వేరైనా దేశాభివృద్ధే తమ లక్ష్యమని చంద్రబాబు స్పష్టీకరణ








### విజయవాడ ఉత్సవ్ 2.0.. వేదికపై మెరిసిన చంద్రబాబు, విజయ్

- విజయవాడ దసరా ఉత్సవాల్లో కలిసి పాల్గొన్న సీఎం చంద్రబాబు, తమిళనాడు సీఎం విజయ్
- వేడుకలకు ముందు ఇద్దరు ముఖ్యమంత్రుల మధ్య కీలక భేటీ
- తెలుగు గంగ, గోదావరి-కావేరి అనుసంధానంపై చర్చించిన నేతలు
- ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మను దర్శించుకున్న సీఎం విజయ్
- పున్నమి ఘాట్‌లో ఇద్దరు సీఎంలకు అభిమానులు, ప్రజల నుంచి భారీ స్పందన

## చెన్నైకి తాగునీరు ఇవ్వండి

### చంద్రబాబును కోరిన సీఎం విజయ్

- ఉండవల్లిలో ఏపీ, తమిళనాడు ముఖ్యమంత్రుల సమావేశం
- చెన్నై తాగునీటి అవసరాల కోసం అదనపు జలాలు కోరిన సీఎం విజయ్
- గోదావరి-కావేరి నదుల అనుసంధానంపై చర్చించిన చంద్రబాబు
- నీటి లభ్యతను బట్టి సాయం చేస్తామని చంద్రబాబు హామీ
- ఇప్పటికే చెన్నైకి 4.08 టీఎంసీలు విడుదల చేశామని వెల్లడి

పెన్ పవర్ డెస్క్:తమ రాష్ట్ర రాజధాని చెన్నై నగరం ఎదుర్కొంటున్న తీవ్ర తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు తెలుగు గంగ ద్వారా అదనపు జలాలను విడుదల చేయాలని తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబును కోరారు. విజయవాడ ఉత్సవ్‌లో పాల్గొనేందుకు విచ్చేసిన ఆయన, మంగళవారం అమరావతిలోని ముఖ్యమంత్రి క్యాంప్ కార్యాలయంలో చంద్రబాబుతో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సమావేశంలో ప్రధానంగా ఇరు రాష్ట్రాల మధ్య నీటి పంపకాల అంశంపైనే

- మిగతా 2లో








## ఆమ్రపాలి క్యాడర్ వివాదం.. హైకోర్టులో తీర్పు రిజర్వ్

- ఐఏఎస్ అధికారిణి ఆమ్రపాలి పిటిషన్‌పై హైకోర్టులో తీర్పు రిజర్వ్
- తెలంగాణ క్యాడర్‌కు కేటాయించాలని గతంలో క్యాట్ ఇచ్చిన ఆదేశాలు
- క్యాట్ తీర్పుపై హైకోర్టు విధించిన స్టేను సవాల్ చేసిన ఆమ్రపాలి
- ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం.. తీర్పుపై సర్వత్రా ఆసక్తి

- మిగతా 2లో



## కేంద్ర మంత్రి పదవికి డాక్టర్ ఎల్. మురుగన్ రాజీనామా

పెన్ పవర్ డెస్క్: సీఈసీ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ కాక్రోచ్ జనతా పార్టీ, ప్రతిపక్ష ఇండియా కూటమి పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తోన్న వేళ దేశ రాజకీయాల్లో కీలక పరిణామం చోటు చేసుకుంది. కేంద్ర సమాచార ప్రసార శాఖ, పార్లమెంటరీ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి డాక్టర్ ఎల్. మురుగన్ తన పదవికి రాజీనామా చేశారు.

- మిగతా 2లో

## ఏపీ స్థానిక సమరం: కూటమిలో సీట్ల సర్దుబాటుపై తీవ్ర కసరత్తు..

- ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక ఎన్నికల వేళ ఎన్డీయేలో జోరందుకున్న సీట్ల పంపకాల చర్చలు
- ముందుగా జనసేనతో డీల్ ఖరారు చేసి, ఆపై బీజేపీతో చర్చించాలని చంద్రబాబు నిర్ణయం
- తమ త్యాగాలకు గుర్తింపుగా తగిన ప్రాతినిధ్యం ఇవ్వాలని కోరిన పవన్
- మంగళవారం రాత్రి సీఎం నివాసంలో టీడీపీ, జనసేన నేతల తుది భేటీ
- అక్టోబర్ 14న నోటిఫికేషన్ వెలువడే అవకాశం ఉండటంతో చర్చల్లో పెరిగిన వే

- మిగతా 2లో

పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్‌లో త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో అధికార ఎన్డీయే కూటమిలో సీట్ల పంపకాలపై మంతనాలు ఉత్కంఠభరితంగా సాగుతున్నాయి. మంగళవారం నాడు తెలుగుదేశం, జనసేన, బీజేపీ నేతల మధ్య చర్చలు తారాస్థాయికి చేరాయి. కూటమిలోని భాగస్వామ్య పక్షాల మధ్య సీట్ల సర్దుబాటును సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత చంద్రబాబు ప్రయత్నాలు ముమ్మరం చేశారు.





## కేంద్రంపై ఉమ్మడి పోరాటం..

### మోదీ, షా చుట్టూ ఉచ్చు బిగుస్తోంది

- ప్రజాస్వామ్య పునరుద్ధరణ కోసం తమ పోరాటం ఆగదని స్పష్టం చేసిన విపక్షాలు
- నిరసన ప్రదేశంగా జంతర్ మంతర్ హోదా రద్దును తీవ్రంగా ఖండన
- ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్
- రాహుల్ గాంధీ నాయకత్వంలో ఉద్యమం కొనసాగుతుందని ప్రకటించిన కూటమి నేతలు

- మిగతా 2లో

## ఓటములకు ఓటర్ల జాబితా కారణమా? రాహుల్ గాంధీపై అమిత్ షా ఫైర్

- సీఈసీ రాజీనామా డిమాండ్‌తో నిరసనలు చేస్తున్న రాహుల్‌పై అమిత్ షా విమర్శలు
- గుజరాత్ స్థానిక ఎన్నికల ఓటమికి ఓటర్ల జాబితా సవరణ కారణమా అని ప్రశ్న
- గాంధీనగర్‌లో 41 ఏళ్లుగా కాంగ్రెస్ గెలవలేదని గుర్తుచేసిన హోంమంత్రి
- ప్రధాని మోదీకి ప్రజామద్దతుకు గుజరాత్ విజయమే నిదర్శనమని వ్యాఖ్య

- మిగతా 2లో



## స్టార్‌లింక్‌కు అనుమతులు ఆపండి

### కేంద్రానికి ఆరెస్సెస్ అనుబంధ సంస్థ విజ్ఞప్తి

- స్టార్‌లింక్ బ్రాడ్‌బ్యాండ్ సేవలకు అనుమతులు నిలిపివేయాలని కేంద్రానికి విజ్ఞప్తి
- ఎలాన్ మస్క్ వ్యాఖ్యలు బాధ్యతారహితమన్న స్వదేశీ జాగరణ్ మంచ్
- జాతీయ భద్రత దృష్ట్యా స్టార్‌లింక్‌ను నిరోధించే హక్కు భారత్‌కు ఉందని స్పష్టీకరణ
- విదేశీ కంపెనీకి బదులు దేశీయ సేవలను ప్రోత్సహించాలని సూచన

- మిగతా 2లో




## లడఖ్ పేర్లపై చైనా అక్కసు.. గట్టిగా బుద్ధి చెప్పిన భారత్

- లడఖ్‌లోని 28 ప్రాంతాలకు పేర్లు ఖరారు చేసిన కేంద్రం
- భారత్ చర్యపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసిన చైనా
- లడఖ్ భారత్‌లో అంతర్భాగమని స్పష్టం చేసిన విదేశాంగ శాఖ
- చైనా వాదనలతో వాస్తవాలు మారవని భారత్ ఘాటు జవాబు

- మిగతా 2లో



# ఎడిటర్ వ్యూ

## ఓటములకు ఓటర్ల జాబితా కారణమా? రాహుల్ గాంధీపై అమిత్ షా ఫైర్

కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ రాజీనామాను డిమాండ్ చేస్తూ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ చేస్తున్న ఆరోపణలపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. గుజరాత్‌లోని గాంధీనగర్ సహా ఇతర ప్రాంతాల్లో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ ఓటమికి ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (సర్) కారణమా? అని ఆయన సూటిగా ప్రశ్నించారు. ఎస్ఐఆర్ ఇటీవల వచ్చిందేనని, కానీ రాహుల్ గాంధీ రాజకీయాల్లోకి ప్రవేశించినప్పటి నుంచి కాంగ్రెస్ పార్టీ వరుస పరాజయాలను చవిచూస్తోందని, తన వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికే ఇటువంటి నిరాధార ఆరోపణలు చేస్తున్నారని దుయ్యబట్టారు.మంగళవారం 'ఇండియా' కూటమి నేతలు, విద్యార్థి సంఘాలతో సమావేశమైన అనంతరం రాహుల్ గాంధీ మీడియా సమావేశం నిర్వహించారు. ఓటర్ల జాబితా సవరణలో అక్రమాలు జరుగుతున్నాయని, సీఈసీ ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని ఆయన ఆరోపించారు. దేశంలో ప్రజాస్వామ్య పునరుద్ధరణ కోసమే తమ పోరాటమని ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

రాహుల్ మీడియా సమావేశం ముగిసిన వెంటనే స్పందించిన అమిత్ షా, గుజరాత్ ఎన్నికల ఫలితాలను ప్రస్తావిస్తూ కాంగ్రెస్‌పై విమర్శనాస్త్రాలు సంధించారు. "గుజరాత్ ప్రజల మనోగతాన్ని ఈ ఫలితాలు ప్రతిబింబిస్తున్నాయి. యావత్ దేశం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వెనుక కొండలా నిలబడి ఉందన్న విషయాన్ని ఈ విజయం చాటిచెప్పింది. గాంధీనగర్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని 44 స్థానాలకు గాను బీజేపీ 38 చోట్ల ఘన విజయం సాధించింది. గత ఎన్నికలతో పోలిస్తే బీజేపీ ఓటు బ్యాంకు 10 శాతం పెరిగింది. రాహుల్ గాంధీకి నేను ఒక విషయం స్పష్టం చేయాలనుకుంటున్నాను. గాంధీనగర్‌లో గత 41 ఏళ్లుగా కాంగ్రెస్ ఒక్క ఎన్నికలోనూ విజయం సాధించలేదు" అని ఆయన గుర్తుచేశారు."రాహుల్ జీ, ఈ ఫలితాలకు కూడా ఓటర్ల జాబితా సవరణే కారణమని అంటారా? ప్రధాని మోదీకి, బీజేపీకి ఉన్న ప్రజాదరణను మీరు తోసిపుచ్చుతారా? మీరు తీవ్రంగా ఆత్మపరిశీలన చేసుకోవాలి. ఒకప్పుడు అధికారంలో ఉన్న కీలక ప్రాంతంలో 41 ఏళ్లుగా గెలవలేకపోవడంపై ఆలోచించాల్సిన అవసరం ఉంది. ఇటీవల పశ్చిమ బెంగాల్, తమిళనాడు, పుదుచ్చేరిల్లో జరిగిన ఉప ఎన్నికల్లోనూ కాంగ్రెస్ ఒక్క సీటు కూడా గెలవలేకపోయింది" అని అమిత్ షా ఎత్తి చూపారు.ఢిల్లీలో వివిధ పార్టీల కార్యకర్తలను, జనాలను పోగేసినంత మాత్రాన దేశ ప్రజల నమ్మకాన్ని గెలుచుకోలేరని ఆయన హితవు పలికారు. "దేశ ప్రజల వాస్తవ గొంతుక పొలాల్లో, గ్రామాల్లో, మారుమూల కొండలు, అడవులు, నదీ తీరాల్లో ఉంది. మీకు అక్కడి ప్రజలతో సంబంధాలు తెగిపోయాయి. బీహార్, ఉత్తరప్రదేశ్, తమిళనాడు వంటి అనేక రాష్ట్రాల్లో ప్రజలు దశాబ్దాలుగా కాంగ్రెస్‌ను తిరస్కరిస్తూనే ఉన్నారు. ఇప్పటికైనా ప్రతికూల రాజకీయాలు మానుకుని ప్రజలతో మమేకం కావాలి" అని ఆయన సూచించారు. 2029 లోక్‌సభ ఎన్నికల్లోనూ రాహుల్ గాంధీ, ఆయన మిత్రపక్షాలకు బీజేపీ-ఎన్డీయే కూటమి మరో భారీ ఓటమిని రుచి చూపిస్తుందని అమిత్ షా ధీమా వ్యక్తం చేశారు.

## చెన్నైకి తాగునీరు ఇవ్వండి

- మొదటి పేజి తరువాయి

చర్చలు జరిగాయి.ముఖ్యమంత్రి విజయ్‌కు, ఆయన వెంట వచ్చిన అధికారులకు ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ సాదరంగా స్వాగతం పలికారు. అనంతరం జరిగిన సమావేశంలో చెన్నై నగర తాగునీటి అవసరాలను తీర్చడంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మరింతగా సహకరించాలని సీఎం విజయ్ అభ్యర్థించారు. దీనిపై చంద్రబాబు సానుకూలంగా స్పందించారు. ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావంతో కృష్ణా నదిలో జలాల లభ్యత గణనీయంగా తగ్గి, ఏపీలోనే తీవ్ర నీటి ఎద్దడి నెలకొన్న విషయాన్ని ఆయన ప్రస్తావించారు. అయినప్పటికీ, పొరుగు రాష్ట్ర దాహార్తిని తీర్చాల్సిన బాధ్యత తమపై ఉందని ఆయన స్పష్టం చేశారు.ఇప్పటికే ఒప్పందం ప్రకారం చెన్నై నగరానికి 4.08 టీఎంసీల నీటిని విడుదల చేసినట్లు చంద్రబాబు వివరించారు. భవిష్యత్తులో ప్రాజెక్టులలో నీటి లభ్యత, అవసరాలను బేరీజు వేసుకుని, మరికొంత నీటిని విడుదల చేసే అంశాన్ని కచ్చితంగా పరిశీలిస్తామని ఆయన విజయ్‌కు హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా కరవు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే గోదావరి-కావేరి నదుల అనుసంధానం ప్రాజెక్టు ఆవశ్యకతను చంద్రబాబు నొక్కి చెప్పారు. ఈ బృహత్తర పథకం రెండు రాష్ట్రాలకే కాకుండా దేశానికే మేలు చేస్తుందని ఆయన వివరించారు. ఇరు రాష్ట్రాల ఉన్నతాధికారులు పాల్గొన్న ఈ సమావేశంలో పలు ద్వైపాక్షిక అంశాలపై ఫలప్రదమైన చర్చలు జరిగాయి.

## కేంద్రంపై ఉమ్మడి పోరాటం.. మోదీ, షా చుట్టూ ఉచ్చు బిగుస్తోంది

ప్రజాస్వామ్య పునరుద్ధరణ కోసం కేంద్ర ప్రభుత్వంపై తమ పోరాటాన్ని కొనసాగిస్తామని విపక్షాలు మంగళవారం స్పష్టం చేశాయి. న్యాయవ్యవస్థ వంటి రాజ్యాంగబద్ధ సంస్థలు ఎలాంటి పాత్ర పోషించినా, పోషించకపోయినా తమ ప్రతిఘటన ఆగదని తేల్చిచెప్పాయి. నిరసనల వేదికగా జంతర్ మంతర్‌కు ఉన్న గుర్తింపును రద్దు చేయాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని, దీనిపై పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని ప్రకటించాయి.ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, సోనియా గాంధీతో పాటు ఆర్జేడీ, సమాజ్‌వాదీ పార్టీ, సీపీఎం, సీపీఐ, తృణమూల్ కాంగ్రెస్, శివసేన (యూబీటీ) సహా 'ఇండియా' కూటమికి చెందిన పలువురు కీలక నేతలు, విద్యార్థి సంఘాల నాయకులు, పౌర సమాజ ప్రతినిధులు పాల్గొన్నారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ రాజీనామాను డిమాండ్ చేస్తూ చేపట్టిన నిరసనల అనంతరం, తదుపరి కార్యాచరణపై చర్చించేందుకు రాహుల్ ఈ సమావేశాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా రాహుల్ గాంధీ మాట్లాడుతూ, "మాకు సుప్రీంకోర్టు, ప్రధాన న్యాయమూర్తి, న్యాయవ్యవస్థపై అపారమైన గౌరవం ఉంది. వారు తమ బాధ్యతను నిర్వర్తిస్తారని ఆశిస్తున్నాం. ఏ వ్యవస్థ స్పందించినా, స్పందించకపోయినా మా రాజకీయ, ప్రజా ప్రతిఘటన కొనసాగుతుంది, అంతిమంగా విజయం సాధిస్తుంది" అని అన్నారు. రాజ్యాంగాన్ని దెబ్బతీసి అంత సులభంగా తప్పించుకోలేరని ఆయన హెచ్చరించారు. ఓట్ల దొంగతనానికి పాల్పడిన వారిపై చర్యలు తప్పవని పునరుద్ఘాటించారు. "ఈ కుట్రకు ప్రధాన రూపశిల్పి మోదీ కాగా, అమలు చేసిన వ్యక్తులు అమిత్ షా, జ్ఞానేశ్ కుమార్ అని, వారి చుట్టూ ఉచ్చు బిగుస్తోందని వారు గ్రహించాలి. వారందరినీ న్యాయస్థానం ముందు నిలబెడతామని హామీ ఇస్తున్నాం" అని రాహుల్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

### జంతర్ మంతర్‌పై పోరాటం

నిరసన ప్రదేశంగా జంతర్ మంతర్ హోదాను ప్రభుత్వం రద్దు చేయడాన్ని పలువురు నేతలు తీవ్రంగా ఖండించారు. "ప్రభుత్వంలోని భయం ఈ నిర్ణయంలో స్పష్టంగా కనిపిస్తోంది" అని ఆర్జేడీ నేత తేజస్వి యాదవ్ విమర్శించారు. జంతర్ మంతర్‌ను తిరిగి దక్కించుకోవడానికి పోరాడతామని సీపీఐ నేత డి. రాజా ప్రకటించారు. రాబోయే రోజుల్లో 'ఇండియా' కూటమి చేపట్టే ప్రతీ కార్యక్రమంలోనూ జంతర్ మంతర్ వైపు మార్చ్ చేసే ప్రయత్నం ఉంటుందని కూటమి వర్గాలు తెలిపాయి.

సీపీఎం పొలిట్‌బ్యూరో సైతం ఈ నిర్ణయాన్ని వ్యతిరేకించింది. శాంతియుత నిరసన హక్కును బలహీనపరిచేందుకే ప్రభుత్వం ఈ చర్యకు పాల్పడిందని ఆరోపించింది.

ఈ సమావేశంలో పాల్గొన్న ఇతర నేతలు సైతం బీజేపీ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. రాజ్యాంగం ప్రమాదంలో పడటంతోనే ప్రజాస్వామ్య శక్తులన్నీ ఏకమయ్యాయని ఎన్సీపీ (ఎస్పీ) ఎంపీ సుప్రియా సూలే అన్నారు. 'ఓట్ల దొంగతనం'లో పాలుపంచుకున్న జ్ఞానేశ్ కుమార్, ఇతర అధికారులపై చర్యలు తీసుకునే వరకు తమ పోరాటం ఆగదని తృణమూల్ నేత సాగరిక ఘోష్ స్పష్టం చేశారు. రాహుల్ గాంధీ నాయకత్వంలో సీఈసీని పదవి నుంచి తప్పించే వరకు ఉద్యమం కొనసాగుతుందని శివసేన (యూబీటీ) ఎంపీ సంజయ్ రౌత్ తెలిపారు.

# దళపతి విజయ్ రాకతో విజయవాడ దద్దరిల్లింది

తమిళనాడు ముఖ్యమంత్రి దళపతి విజయ్ రాకతో విజయవాడ నగరం దద్దరిల్లిపోతోందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. విజయవాడలో నిర్వహించిన 'విజయవాడ ఉత్సవ్ 2.0' సభకు ముఖ్య అతిథిగా విచ్చేసిన విజయ్‌తో కలిసి ఆయన వేదికను పంచుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో చంద్రబాబు ఉద్విగ్నంగా ప్రసంగించారు. దుర్గమ్మ, భారత్ మాత, తెలుగు తల్లికి జయజయధ్వానాలు పలుకుతూ తన ప్రసంగాన్ని ప్రారంభించిన ఆయన, సభకు హాజరైన యువత ఉత్సాహాన్ని చూసి పులకించిపోయారు. "విజయ్ రాకతో మీ ఉత్సాహం చూస్తుంటే విజయవాడ దద్దరిల్లిపోతోంది" అంటూ సభికులను ఉత్తేజపరిచారు. తమిళనాడు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టాక దళపతి విజయ్ మొట్టమొదటిసారిగా మరో రాష్ట్రానికి వచ్చారని, ఆ గడ్డ పవిత్రమైన విజయవాడ కావడం, దుర్గమ్మ తల్లే ఆయన్ను ఇక్కడికి పిలిపించడం సంతోషంగా ఉందని చంద్రబాబు పేర్కొన్నారు. తమిళనాడును అభివృద్ధి చేయాలనే బలమైన పట్టుదలతో, కేవలం రెండేళ్లలోనే పార్టీ పెట్టి ముఖ్యమంత్రి అయిన వ్యక్తి విజయ్ అని కొనియాడారు. ఆయన పట్టుదల, అంకితభావం ఎందరికో స్ఫూర్తిదాయకమని అన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్న ఆర్గనైజింగ్ కమిటీని ఆయన మనస్ఫూర్తిగా అభినందించారు.ఈ సందర్భంగా చంద్రబాబు జాతీయ రాజకీయాలు, నదుల అనుసంధానంపై కీలక వ్యాఖ్యలు చేశారు. "రాష్ట్రాలు వేరు కావచ్చు, కానీ మా అందరి అభిమతం ఒకటే. భారతదేశం, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు సహా అన్ని రాష్ట్రాలు బాగుండాలి" అని ఆయన స్పష్టం చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో ఏదైనా సాధ్యమేనని చెబుతూ, గోదావరి-కావేరి నదుల అనుసంధానం త్వరలోనే జరుగుతుందని ప్రకటించారు. "దుర్గమ్మ తల్లి సాక్షిగా, మన విజయవాడ నుంచే గోదావరి, కృష్ణమ్మ తల్లులు కలుస్తాయి. ఈ మహత్కార్యాన్ని నెరవేర్చగల ఏకైక నాయకుడు నరేంద్ర మోదీ" అని ఆయన అన్నారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే గోదావరి, కృష్ణ, పెన్నా, తుంగభద్ర, కావేరి నదులు అనుసంధానమై నాలుగు రాష్ట్రాలు సస్యశ్యామలం అవుతాయని వివరించారు.వేదిక కింద ఉన్న యువతను, వారి ఉత్సాహాన్ని చూస్తుంటే భారతదేశ భవిష్యత్తుపై తనకు సంపూర్ణ విశ్వాసం కలుగుతోందని చంద్రబాబు అన్నారు. "టెక్నాలజీ, నాలెడ్జ్‌తో భారత యువత ప్రపంచంలో ఏదైనా సాధించగలదు. మీ ఉత్సాహం చూశాక, 2047 నాటికి భారతదేశం ప్రపంచంలోనే నంబర్ వన్ అవుతుందనడంలో ఎలాంటి సందేహం లేదు" అని ఆయన ధీమా వ్యక్తం చేశారు. టెక్నాలజీ, నాలెడ్జ్‌కు ఆధ్యాత్మికతను జోడించి ముందుకు సాగితే అనుకున్న లక్ష్యాలను సులభంగా సాధించవచ్చని, విజయవాడ ఉత్సవాలు వంటి కార్యక్రమాలు ఆ ఆధ్యాత్మిక స్ఫూర్తిని నింపుతాయని తెలిపారు. అనంతరం, వెండితెరపై కోట్లాది మంది అభిమానాన్ని చూరగొని, ప్రజా జీవితంలోకి అడుగుపెట్టిన తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్‌ను ప్రసంగించవలసిందిగా చంద్రబాబు సాదరంగా ఆహ్వానించారు.

**విజయవాడ ఉత్సవ్ 2.0.. వేదికపై మెరిసిన చంద్రబాబు, విజయ్**

ఆంధ్రప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాల మధ్య స్నేహ సంబంధాలకు ప్రతీకగా నిలిచే అరుదైన దృశ్యం విజయవాడలో ఆవిష్కృతమైంది. ఏపీ ప్రభుత్వం నిర్వహిస్తున్న విజయవాడ ఉత్సవ్ 2.0 (దసరా ఉత్సవాలు) వేడుకల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు, తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ ఒకే వేదికను పంచుకున్నారు. మంగళవారం సాయంత్రం విజయవాడలోని పున్నమి ఘాట్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సీఎం విజయ్‌కు, చంద్రబాబు ఘన స్వాగతం పలికారు.ఈ వేడుకలకు ముందు ఇరువురు ముఖ్యమంత్రులు ప్రత్యేకంగా సమావేశమై కీలక అంశాలపై చర్చించారు. దశాబ్దాలుగా రెండు రాష్ట్రాల మధ్య ఉన్న సంబంధాలను బలోపేతం చేసే దిశగా ఈ భేటీ సాగింది. ముఖ్యంగా, తెలుగు గంగ ప్రాజెక్టు ద్వారా తమిళనాడుకు కృష్ణా జలాల సరఫరా కొనసాగింపు, ప్రతిష్ఠాత్మకమైన గోదావరి-కృష్ణా-కావేరి నదుల అనుసంధానం ప్రాజెక్టుపై ఇద్దరు నేతలు సుదీర్ఘంగా చర్చించుకున్నట్లు తెలిసింది.అంతకుముందు, విజయవాడ పర్యటనకు వచ్చిన సీఎం విజయ్, ఇంద్రకీలాద్రిపై కొలువైన కనకదుర్గమ్మ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అధికారులు, అర్చకులు ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం చంద్రబాబు, విజయ్ ఇద్దరూ ఒకే కాన్వాయ్‌లో పున్నమి ఘాట్‌కు చేరుకోవడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. దారి పొడవునా అభిమానులు, ప్రజలు వారికి నీరాజనాలు పలికారు.కృష్ణా నదీ తీరాన ఏర్పాటు చేసిన వేదికపై ఇరువురు నేతలు ఆశీనులై సాంస్కృతిక ప్రదర్శనలను తిలకించారు. ఈ సందర్భంగా ఏపీ ప్రభుత్వం తరఫున చంద్రబాబు, తమిళనాడు సీఎం విజయ్‌ను సత్కరించారు. ఈ పర్యటన కేవలం సాంస్కృతిక వేడుకలకే పరిమితం కాకుండా, రెండు పొరుగు రాష్ట్రాల మధ్య సహకారానికి, జల వివాదాల పరిష్కారానికి మార్గం సుగమం చేస్తుందని విశ్లేషకులు భావిస్తున్నారు.

## ఏపీలో స్థానిక ఎన్నికలకు నేడు షెడ్యూల్ విడుదల

ఆంధ్రప్రదేశ్‌లో ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న స్థానిక సంస్థల ఎన్నికలకు మార్గం సుగమమైంది. ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ) షెడ్యూల్‌ను ఖరారు చేసింది. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా బుధవారం ఉదయం 11:30 గంటలకు విజయవాడలో మీడియా సమావేశం నిర్వహించి, పూర్తి షెడ్యూల్‌ను అధికారికంగా విడుదల చేయనున్నారు. దీంతో రాష్ట్రంలో ఎన్నికల వాతావరణం నెలకొంది.మొత్తం మూడు దశల్లో ఈ ఎన్నికలు జరగనున్నట్టు తెలుస్తోంది. తొలి విడతలో పట్టణ స్థానిక సంస్థలైన మున్సిపాలిటీలకు ఎన్నికలు నిర్వహిస్తారు. దీనికి సంబంధించిన నోటిఫికేషన్‌ను కూడా బుధవారమే విడుదల చేసే అవకాశాలున్నాయి. రెండో విడతలో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు, ఆ తర్వాత మూడో విడతలో గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహించేందుకు ఎస్ఈసీ ప్రణాళిక సిద్ధం చేసినట్టు సమాచారం. ఈ ఎన్నికల నిర్వహణకు సంబంధించి అన్ని జిల్లాల నుంచి గెజిట్ నోటిఫికేషన్లు ఇప్పటికే ఎన్నికల సంఘానికి చేరాయి. దీంతో షెడ్యూల్ విడుదలకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. బుధవారం ఉదయం 11.30 గంటలకు విజయవాడ ఎం.జీ. రోడ్డులోని నూతన హెచ్ఓడీ భవనంలో ఉన్న రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యాలయంలో కమిషనర్ పునేఠా ఈ వివరాలను మీడియాకు వెల్లడించనున్నారు. ఈ మేరకు ఎస్ఈసీ కార్యదర్శి మీడియాకు ఆహ్వానం పంపారు.

## ఏపీ మహిళా కమిషన్ సభ్యురాలిగా 'స్వాతిరెడ్డి' నియామకం

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలిగా 'స్వాతి రెడ్డి' (గౌతమి శ్వేత కోట) నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది. తెలుగుదేశం పార్టీకి గట్టి మద్దతుదారురాలిగా ఆమెకు గుర్తింపు ఉంది.గత ఎన్నికల ముందు 'స్వాతిరెడ్డి' సోషల్ మీడియా వేదికగా తీవ్రమైన వేధింపులను, ట్రోలింగ్‌ను ఎదుర్కొన్నారు. ఆ సమయంలో ఆమె టీడీపీకి మద్దతుగా తన గళాన్ని బలంగా వినిపించారు. ప్రతికూల పరిస్థితుల్లో, వేలాది మంది నుంచి ఆన్‌లైన్‌లో విమర్శలు ఎదురైనప్పటికీ ఆమె వెనకడుగు వేయకుండా పార్టీ వైఖరికి కట్టుబడి నిలిచారు.

ప్రస్తుతం రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో, కష్టకాలంలో పార్టీకి అండగా నిలిచిన వారికి తగిన ప్రాధాన్యం ఇవ్వాలని అధిష్ఠానం భావిస్తోంది. ఈ క్రమంలో 'స్వాతిరెడ్డి' సేవలను గుర్తించి, ఆమెకు మహిళా కమిషన్‌లో సభ్యురాలిగా కీలక బాధ్యతలు అప్పగించారు. ఆమె నియామకంపై టీడీపీ శ్రేణులు, మద్దతుదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అమరావతి నుంచి ఈ నియామకానికి సంబంధించిన ఉత్తర్వులు వెలువడ్డాయి.

**లోకేశ్ అన్న చెప్పింది ముమ్మాటికీ నిజం: స్వాతిరెడ్డి**

తన నియామకంపై స్వాతిరెడ్డి సోషల్ మీడియా వేదికగా స్పందించారు. " నన్ను గుర్తించిన నా దేవుడు, తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు గారికి, అలాగే నన్ను గుర్తించిన నా అన్న లోకేశ్ గారికి సదా ఋణపడి ఉంటాను. ఈ రోజు మీరు నాకు ఏపీ మహిళా కమిషన్ సభ్యురాలిగా అవకాశం కల్పించినందుకు కృతజ్ఞతలు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, మీరు నా మీద పెట్టిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటాను. "కార్యకర్తే అధినేత" అని లోకేశ్ అన్న చెప్పిన మాటలు ముమ్మాటికీ నిజం. కంఠంలో ప్రాణం ఉన్నంతవరకు నా పార్టీ తెలుగుదేశం కోసం కష్టపడుతూనే ఉంటాను" అంటూ ట్వీట్ చేశారు.

## ఆమ్రపాలి క్యాడర్ వివాదం.. హైకోర్టులో తీర్పు రిజర్వ్

సీనియర్ ఐఏఎస్ అధికారిణి ఆమ్రపాలి తన క్యాడర్ కేటాయింపు వివాదంపై దాఖలు చేసిన పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టులో విచారణ ముగిసింది. ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం, తీర్పును రిజర్వ్‌లో ఉంచింది. దీంతో ఆమె క్యాడర్ కేటాయింపుపై నెలకొన్న ఉత్కంఠ కొనసాగుతోంది.

రాష్ట్ర విభజన అనంతరం కేంద్ర ప్రభుత్వం ఆమ్రపాలిని ఆంధ్రప్రదేశ్ క్యాడర్‌కు కేటాయించింది. అయితే, కేంద్ర ప్రభుత్వ ఉత్తర్వులను సవాలు చేస్తూ ఆమ్రపాలి కేంద్ర పరిపాలనా ట్రైబ్యునల్ (క్యాట్)ను ఆశ్రయించారు. ఈ పిటిషన్‌ను విచారించిన క్యాట్, ఆమెను ఏపీకి కేటాయిస్తూ జారీ చేసిన ప్రొసీడింగ్స్‌ను రద్దు చేయడంతో పాటు, తెలంగాణ క్యాడర్‌కు కేటాయించాలని ఆదేశాలు జారీ చేసింది.అయితే, క్యాట్ వెలువరించిన ఈ తీర్పుపై తెలంగాణ హైకోర్టు గతంలో స్టే విధించింది.

దీంతో క్యాట్ ఆదేశాల అమలు నిలిచిపోయింది. హైకోర్టు ఇచ్చిన ఈ స్టే ఉత్తర్వులను సవాలు చేస్తూ ఆమ్రపాలి ఉన్నత న్యాయస్థానంలోనే మరో పిటిషన్ దాఖలు చేశారు. తాజాగా ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన ధర్మాసనం, ఇరుపక్షాల వాదనలు విన్న అనంతరం తీర్పును రిజర్వ్‌లో ఉంచింది. హైకోర్టు వెలువరించే తుది తీర్పుతో ఆమ్రపాలి క్యాడర్ కేటాయింపు వ్యవహారంపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

## ఏపీ స్థానిక సమరం: కూటమిలో సీట్ల సర్దుబాటుపై తీవ్ర కసరత్తు..

- మొదటి పేజి తరువాయి

అక్టోబర్ 14న ఎన్నికల షెడ్యూల్ వెలువడవచ్చన్న అంచనాల నేపథ్యంలో, ఆ లోపే పంపకాలను పూర్తి చేసి ఐక్యంగా బరిలోకి దిగాలని కూటమి భావిస్తోంది.ఈ క్రమంలో భాగంగా నేడు రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, ముఖ్యమంత్రి చంద్రబాబుతో సమావేశమయ్యారు. రెండు రోజుల్లో వీరి మధ్య ఇది రెండో దఫా చర్చలు కావడం గమనార్హం. అయితే, బీజేపీతో చర్చలను కొలిక్కితెచ్చే ముందు, జనసేనకు కేటాయించాల్సిన సీట్లపై ఒక స్పష్టతకు రావాలని చంద్రబాబు భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ వ్యూహంలో భాగంగానే ఆయన టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, మంత్రి నిమ్మల రామానాయుడుతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. అనంతరం, పల్లా శ్రీనివాసరావు, నిమ్మల రామానాయుడు నేరుగా జనసేన కార్యాలయానికి వెళ్లి ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌తో చర్చలు జరిపారు. ఈ సమావేశంలో జనసేన తరఫున మంత్రి నాదెండ్ల మనోహర్, వంశీకృష్ణ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.తాజా సమాచారం ప్రకారం, మంగళవారం రాత్రి ముఖ్యమంత్రి చంద్రబాబు నివాసంలో టీడీపీ, జనసేన నేతలు మరోసారి భేటీ కానున్నారు. ఈ సమావేశంలోనే సీట్ల సర్దుబాటుపై తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. ముఖ్యమైన నగరపాలక సంస్థల మేయర్ అభ్యర్థుల ఎంపికపైనా ఈ భేటీలో చర్చించనున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే జనసేన, బీజేపీలు తమ బలాబలాల ఆధారంగా ఆశిస్తున్న స్థానాల జాబితాను చంద్రబాబుకు అందజేశాయి. పార్టీల గెలుపు అవకాశాలను బట్టి సీట్ల కేటాయింపు ఉంటుందని కూటమి వర్గాలు చెబుతున్నాయి. గత వారం కూడా చంద్రబాబు, పవన్ కల్యాణ్ మధ్య సీట్ల పంపకాలు, ఎన్నికల వ్యూహాలు, క్షేత్రస్థాయిలో సమన్వయం వంటి అంశాలపై సుదీర్ఘంగా చర్చలు జరిగాయి.ఈ చర్చల నేపథ్యంలో, అక్టోబర్ 11న పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. కూటమి ఏర్పాటు, విజయం కోసం జనసేన, జనసైనికులు ఎన్నో త్యాగాలు చేశారని, ఆ త్యాగాలకు గుర్తింపుగా మిత్రధర్మాన్ని అనుసరించి స్థానిక సంస్థల్లో తమకు తగిన ప్రాతినిధ్యం కల్పించాలని ఆయన స్పష్టం చేశారు. "2024 ఎన్నికల్లో రాష్ట్ర భవిష్యత్తు కోసం పోరాడాం. ఇప్పుడు జరగబోయే స్థానిక ఎన్నికలు జనసైనికుల భవిష్యత్తుకు భరోసా ఇస్తాయని ఆశిస్తున్నాను" అని ఆయన పేర్కొన్నారు.

2014లో కూడా జనసైనికులు త్యాగాలు చేశారని పవన్ తెలిపారు. "2014లో కూటమికి మద్దతుగా నిలిచినప్పుడు ఒక్క జనసైనికుడు కూడా పదవి ఆశించలేదు. రాష్ట్ర ప్రయోజనాలే ముఖ్యమని నిస్వార్థంగా పనిచేశారు. వ్యక్తిగత ప్రయోజనాలను పక్కనపెట్టి పార్టీ కోసం, కూటమి కోసం ఎన్నో త్యాగాలు చేశారు" అంటూ ఆయన వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యల ద్వారా, స్థానిక ఎన్నికల్లో తమ పార్టీ శ్రేణులకు న్యాయం జరగాలనే సంకేతాన్ని పవన్ బలంగా పంపారు. దీంతో సర్దుబాటు ప్రక్రియలో జనసేన డిమాండ్లకు ఎలాంటి ప్రాధాన్యం లభిస్తుందనేది ఆసక్తికరంగా మారింది.

## స్టార్‌లింక్‌కు అనుమతులు ఆపండి: కేంద్రానికి ఆరెస్సెస్ అనుబంధ సంస్థ విజ్ఞప్తి

ప్రముఖ పారిశ్రామికవేత్త ఎలాన్ మస్క్‌కు చెందిన 'స్టార్‌లింక్' శాటిలైట్ బ్రాడ్‌బ్యాండ్ సేవలకు భారత్‌లో అనుమతులు మంజూరు చేయవద్దని, ఇందుకు సంబంధించిన ప్రక్రియను తక్షణమే నిలిపివేయాలని ఆరెస్సెస్ అనుబంధ సంస్థ స్వదేశీ జాగరణ్ మంచ్ (ఎస్‌జేఎం) కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది. అనుమతుల జాప్యంపై ఎలాన్ మస్క్ భారత ప్రభుత్వం, వ్యాపార వర్గాలను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించిన ఎస్‌జేఎం, ఇవి ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చే ప్రయత్నాలని ఆరోపించింది.ఈ అంశంపై స్వదేశీ జాగరణ్ మంచ్ జాతీయ కో-కన్వీనర్ అశ్వినీ మహాజన్ మాట్లాడుతూ, "భారత్‌లో అనుమతుల జాప్యంపై ఎలాన్ మస్క్ చేసిన వ్యాఖ్యలు అత్యంత బాధ్యతారహితమైనవి. వాణిజ్య కార్యకలాపాల కోసం అనుమతులు కోరిన సంస్థ, ఆ ప్రక్రియ కొనసాగుతుండగానే ప్రభుత్వంపై, దేశీయ వ్యాపార వర్గాలపై విమర్శలు చేయడం సమంజసం కాదు. నిబంధనల ప్రకారం అనుమతులు పొందకుండా, ప్రత్యామ్నాయ మార్గాల్లో ఒత్తిడి పెంచే ప్రయత్నంగా ఇది కనిపిస్తోంది" అని విమర్శించారు."జాతీయ భద్రతకు సంబంధించిన అంశాల్లో ఏమాత్రం రాజీ పడకూడదు. ఉక్రెయిన్, ఇరాన్, రష్యా, చైనా, తైవాన్ వంటి పలు దేశాల్లో స్టార్‌లింక్ సేవలు ఇప్పటికే వివాదాస్పదమయ్యాయి. ఈ నేపథ్యంలో, జాతీయ భద్రత దృష్ట్యా స్టార్‌లింక్‌ను నిరోధించే పూర్తి హక్కు భారత్‌కు ఉంది. మన నిర్ణయం అమెరికా వంటి వాణిజ్య భాగస్వాములకు సైతం ఒక స్పష్టమైన సందేశాన్ని పంపుతుంది" అని మహాజన్ పేర్కొన్నారు.ఒకవేళ జాతీయ భద్రత కారణాలతో స్టార్‌లింక్‌కు అనుమతులు నిరాకరిస్తే, స్వదేశీ పరిజ్ఞానంతో అభివృద్ధి చేసిన శాటిలైట్ ఇంటర్నెట్ సేవలను ప్రోత్సహించేందుకు గొప్ప అవకాశం లభిస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. దీనివల్ల దేశంలోని మారుమూల ప్రాంతాలకు సైతం మన సొంత సాంకేతికతతో ఇంటర్నెట్ సేవలను అందించవచ్చని సూచించారు. ప్రస్తుతం స్టార్‌లింక్ దరఖాస్తు ప్రభుత్వ పరిశీలనలో ఉన్న తరుణంలో, ఎస్‌జేఎం చేసిన ఈ విజ్ఞప్తి ప్రాధాన్యత సంతరించుకుంది.

## లడఖ్ పేర్లపై చైనా అక్కసు.. గట్టిగా బుద్ధి చెప్పిన భారత్

లడఖ్‌లోని 28 వ్యూహాత్మక ప్రాంతాలకు కేంద్ర ప్రభుత్వం అధికారికంగా పేర్లు ఖరారు చేయడంపై చైనా తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ చర్య చట్టవిరుద్ధమని చైనా ఆరోపించగా, భారత్ అత్యంత ఘాటుగా స్పందించింది. లడఖ్ భారత్‌లో విడదీయరాని అంతర్భాగమని, చైనా ఆరోపణలు ఈ వాస్తవాన్ని మార్చలేవని విదేశాంగ శాఖ స్పష్టం చేసింది.

కేంద్ర హోం మంత్రిత్వ శాఖ, లడఖ్ యంత్రాంగంతో సంప్రదింపులు జరిపిన అనంతరం ఈ నిర్ణయం తీసుకుంది. శిఖరాలు, కనుమలు, జలవనరులతో సహా మొత్తం 28 ప్రదేశాలకు ప్రామాణిక పేర్లను నిర్ణయించి, వాటిని సర్వే ఆఫ్ ఇండియా అధికారిక మ్యాప్‌లో చేర్చనున్నారు. దీనివల్ల ఆయా ప్రాంతాలకు సంబంధించి స్పష్టమైన గుర్తింపు, అవగాహన పెరుగుతుందని విదేశాంగ శాఖ మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంది.తన భౌగోళిక రికార్డులను పటిష్ఠం చేసుకునేందుకే భారత్ ఈ చర్యలు చేపట్టింది. దీనిపై చైనా విదేశాంగ శాఖ ప్రతినిధి మావో నింగ్ స్పందిస్తూ, భారత్ ఏకపక్షంగా ఏర్పాటు చేసిన 'కేంద్రపాలిత ప్రాంతం లడఖ్'ను తాము ఎన్నడూ గుర్తించలేదని వ్యాఖ్యానించారు. "భారత్ ప్రకటిం చిన ప్రామాణిక పేర్లను మేము వ్యతిరేకిస్తున్నాం. ఈ చర్య చట్టవిరుద్ధం, చెల్ల దు. చైనా-భారత్ సరిహద్దులోని పశ్చిమ సెక్టార్‌లోని ఆ ప్రాంతాలు ఎల్లప్పు డూ చైనా భూభాగాలే" అని ఆమె వాదించారు.చైనా వాదనలను భారత్ తీవ్రంగా ఖండించింది. "కేంద్రపాలిత ప్రాంతమైన లడఖ్ భారత్‌లో విడదీ యరాని అంతర్భాగం. ఈ సుస్థిర వాస్తవాన్ని చైనా ఎంతగా వ్యతిరేకించినా మార్చలేదు" అని విదేశాంగ శాఖ తన ప్రకటనలో స్పష్టం చేసింది.

## కేంద్ర మంత్రి పదవికి డాక్టర్ ఎల్. మురుగన్ రాజీనామా

- మొదటి పేజి తరువాయి

ఈ మేరకు ప్రధాని మోడీకి రాజీనామా లేఖను పంపించారు. అలాగే రాజ్యసభ సభ్యత్వానికి కూడా మురుగన్ రిజైన్ చేశారు. సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఎక్స్ (ట్విట్టర్) వేదికగా మంగళవారం (అక్టోబర్ 13) ఈ విషయాన్ని ఆయన ప్రకటించారు. 2029 లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో తమిళనాడులో బీజేపీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడానికి పూర్తిగా సమయం కేటాయించాలని ఈ నిర్ణయం తీసుకున్నట్లు స్పష్టం చేశారు.

తమిళనాడులో బీజేపీ విజయం కోసం క్షేత్రస్థాయిలో కార్యకర్తలతో కలిసి మళ్లీ పని చేస్తానని తెలిపారు. ప్రధాని మోడీ నాయకత్వంలో భారత్ మాతకు, తమిళనాడుకు సేవ చేయడం నా జీవితంలో లభించిన గొప్ప గౌరవమని మురుగన్ పేర్కొన్నారు. అతి సామాన్య కుటుంబంలో పుట్టి కేంద్ర మంత్రివర్గంలో పనిచేయడం నా జీవితంలో లభించిన గొప్ప అదృష్టమన్నారు.

**మురుగన్ పొలిటికల్ కెరీర్:**

మోడీ 3.0 కేబినెట్?లో డాక్టర్ ఎల్. మురుగన్ సమాచార, ప్రసార శాఖ, పార్లమెంటరీ వ్యవహారాల శాఖ సహాయ మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించారు. అంతకుముందు మత్స్య, పశుసంవర్ధక, పాడిపరిశ్రమ శాఖ సహాయ మంత్రిగా కూడా పనిచేశారు. ఆయన మధ్యప్రదేశ్ నుండి రాజ్యసభకు ప్రాతినిధ్యం వహించారు. 2017 నుంచి 2020 వరకు జాతీయ షెడ్యూల్డ్ కులాల కమిషన్ ఉపాధ్యక్షుడిగా పనిచేశారు. బీజేపీ తమిళనాడు యూనిట్ అధ్యక్షుడిగా కూడా మురుగన్ సేవలందించారు.

మరోసారి కేబినెట్ విస్తరణ ప్రచారంకేంద్ర మంత్రి మురుగన్ రాజీనామాతో కేంద్ర కేబినెట్ విస్తరణ ప్రచారం మరోసారి తెరపైకి వచ్చింది. ప్రధాని మోడీ తన కేబినెట్?ను పునర్వ్యవస్థీకరించనున్నట్లు గత కొన్ని రోజులుగా ఢిల్లీ రాజకీయాల్లో జోరుగా ప్రచారం జరుగుతున్న విషయం తెలిసిందే. దేశంలో జెన్ జెడ్ నిరసనలు, 2029 పార్లమెంట్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని కొత్త కేబినెట్ ను ఏర్పాటు చేయనున్నట్లు ఊహాగానాలు వినిపిస్తున్నాయి. యువతకు మరింత చేరువయ్యేందుకు పలువురు సీనియర్లను పక్కన పెట్టి కేబినెట్?లోకి యువ నాయకులను తీసుకోనున్నట్లు టాక్ నడుస్తోంది.

# గిద్దలూరు రెస్టారెంట్లలో డొల్లతనం..

**ఫుడ్ సేఫ్టీ తనిఖీల్లో పలు లోపాలు! -లేబుళ్లు, బిల్లులు లేని చికెన్ నిల్వలు..**

**అపరిశుభ్రంగా కిచెన్లు.. -గృహ వినియోగ గ్యాస్ సిలిండర్ల వాడకం!**

**14 రోజుల్లో లోపాలు సరిచేసుకోవాలని నోటీసులు.. మళ్లీ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు**





**గిద్దలూరు పెన్ పవర్ అక్టోబర్ 13**

గిద్దలూరు పట్టణంలోని పలు రెస్టారెంట్లపై ఫుడ్ సేఫ్టీ అధికారులు మంగళవారం నాడు నిర్వహించిన ఆకస్మిక తనిఖీల్లో ఆహార భద్రత, పరిశుభ్రతకు సంబంధించి పలు లోపాలు వెలుగులోకి వచ్చాయి. చికెన్ నిల్వలకు లేబుళ్లు లేకపోవడం, కొనుగోలు బిల్లులు చూపించకపోవడం, అపరిశుభ్రంగా ఉన్న వంటగదులు, ఆహార పదార్థాల్లో కలర్స్ వినియోగం, గృహ వినియోగ గ్యాస్ సిలిండర్ల వాడకం వంటి అంశాలపై అధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫుడ్ సేఫ్టీ అధికారి శివతేజ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రం నుంచి వచ్చిన ప్రత్యేక బృందం గిద్దలూరు అధికారుల సహకారంతో ఈ తనిఖీలు చేపట్టింది. గతంలో వీఆర్ గ్రాండ్ రెస్టారెంట్‌పై ఆరోపణలు రావడంతో ఈ తనిఖీలు నిర్వహించినట్లు అధికారులు తెలిపారు.

**లేబుళ్లు, బిల్లులు లేని చికెన్ నిల్వలు!**

పలు రెస్టారెంట్లలో ఫ్రిజ్‌లలో చికెన్‌ను కవర్లలో నిల్వ ఉంచినప్పటికీ, వాటి కొనుగోలు తేదీ, నిల్వ వివరాలు తెలిపే లేబుళ్లు లేకపోవడాన్ని అధికారులు గుర్తించారు. కొన్ని నిల్వలకు సంబంధించిన కొనుగోలు బిల్లులు కూడా చూపించలేదని తెలిపారు. చికెన్ ఎక్కడి నుంచి కొనుగోలు చేశారు? ఎప్పటి నుంచి నిల్వ ఉంచారు? దాని నాణ్యతకు సంబంధించిన వివరాలు ఏమిటి? అనే అంశాలను నిర్ధారించేందుకు సరైన రికార్డులు తప్పనిసరిగా నిర్వహించాలని సూచించారు. చికెన్‌ను ఫ్రిజ్‌లలో సరైన పద్ధతిలో నిల్వ చేయకుండా నిర్లక్ష్యంగా ఉంచితే ఆహార నాణ్యత దెబ్బతినే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఫ్రిజ్‌లు ఎందుకు ఉపయోగిస్తున్నారో తెలుసుకుని, ఆహార పదార్థాలను సురక్షితమైన పద్ధతుల్లో నిల్వ చేయాలని నిర్వాహకులకు సూచించారు.

**అపరిశుభ్రంగా కిచెన్లు.. పేరుకుపోయిన నూనె!**

రెస్టారెంట్ల వంటగదులను పరిశీలించిన అధికారులు అక్కడ అపరిశుభ్రత, నూనె పేరుకుపోవడం వంటి లోపాలను గుర్తించారు. వంటగదులను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని, పేరుకుపోయిన నూనె, మురికిని వెంటనే తొలగించాలని ఆదేశించారు. ఫ్రిజ్‌లలో మైదాపిండి, నూనె కలిపిన పదార్థాలను నిల్వ ఉంచే విధానంపైనా అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆహార పదార్థాలకు ఉపయోగించే కలర్స్ డబ్బాలు, ఇతర పదార్థాలను పరిశీలించారు. అనుమతించిన ఆహార రంగులను నిర్దేశిత పరిమితుల్లోనే వినియోగించాలని, నిబంధనలకు విరుద్ధంగా రంగులు ఉపయోగిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆహార తయారీలో నాణ్యత, పరిశుభ్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని స్పష్టం చేశారు.

**గృహ వినియోగ గ్యాస్ సిలిండర్లు రెస్టారెంట్లలో ఎందుకు?**

రెస్టారెంట్లలో గృహ వినియోగానికి ఉద్దేశించిన గ్యాస్ సిలిండర్లను ఉపయోగించడంపై ఫుడ్ సేఫ్టీ అధికారి శివతేజ ప్రశ్నించారు. వాణిజ్య అవసరాల కోసం నిర్వహిస్తున్న రెస్టారెంట్లలో ఇంటి అవసరాలకు ఉపయోగించే సిలిండర్లను ఎందుకు వినియోగిస్తున్నారని నిర్వాహకులను నిలదీశారు. వాణిజ్య అవసరాలకు తగిన సిలిండర్లను నిబంధనల ప్రకారం ఉపయోగించాలని సూచించారు.

**గ్లౌజులు, హెయిర్ క్యాప్స్ ఎక్కడ?**

వంట చేసే సిబ్బంది, బివినియోగదారులకు ఆహారం వడ్డించే సిబ్బంది వ్యక్తిగత పరిశుభ్రత పాటించకపోవడంపై అధికారులు అసహనం వ్యక్తం చేశారు. చేతులకు గ్లౌజులు, తలకు హెయిర్ క్యాప్స్ ధరించకుండా ఆహారం తయారు చేయడం, వడ్డించడం ఏమిటని ప్రశ్నించారు. వీటిని ఏర్పాటు చేయకపోతే తానే డబ్బులు ఇచ్చి మరీ అందిస్తానని నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. సిబ్బంది పరిశుభ్రత పాటించకపోతే వెంట్రుకలు, ఇతర కలుషిత పదార్థాలు ఆహారంలో పడే ప్రమాదం ఉందని తెలిపారు. కస్టమర్లకు ఆహారం అందించే సమయంలో పరిశుభ్రతా నియమాలను తప్పనిసరిగా పాటించాలని, అవసరమైన సామగ్రిని అందుబాటులో ఉంచుకోవాలని ఆదేశించారు.

**చికెన్ వంటకాలు ధ్వంసం.. చెన్నై ల్యాబ్‌కు శాంపిల్స్!**

తనిఖీల సమయంలో పలు రెస్టారెంట్లలో నిల్వ ఉంచిన చికెన్, గతంలో తయారు చేసిన చికెన్ వంటకాలను అధికారులు ధ్వంసం చేయించారు. అలాగే కొన్ని ఆహార నమూనాలను సేకరించారు. వాటిని పరీక్షల నిమిత్తం చెన్నైలోని ప్రయోగశాలకు పంపించనున్నట్లు అధికారులు తెలిపారు. పరీక్షా ఫలితాలు వచ్చిన అనంతరం వాటి ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

**14 రోజుల్లో లోపాలు సరిచేసుకోవాలి!**

తనిఖీల్లో గుర్తించిన లోపాలపై సంబంధిత రెస్టారెంట్ల నిర్వాహకులకు ఇంప్రూవ్‌మెంట్ నోటీసులు జారీ చేశారు. నోటీసులు అందుకున్న వారు 14 రోజుల్లోగా లోపాలను సరిచేసుకుని, ఆహార భద్రతా ప్రమాణాలను పాటించాలని ఆదేశించారు. ప్రస్తుతం లోపాలను సరిచేసుకునేందుకు అవకాశం కల్పించామని, ఇదే తరహా ఉల్లంఘనలు పునరావృతమైతే ఫుడ్ సేఫ్టీ చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. రెస్టారెంట్లపై ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో నిర్వాహకులు బాధ్యతగా వ్యవహరించి ప్రజలకు సురక్షితమైన, నాణ్యమైన ఆహారాన్ని అందించాలని స్పష్టం చేశారు. ప్రయోగశాల పరీక్షా ఫలితాలు వెలువడిన తర్వాత ఆహార నమూనాల నాణ్యతపై స్పష్టత రానుందని. వాటి ఆధారంగా తదుపరి చర్యలు తీసుకునే అవకాశం ఉందన్నారు.

పెన్ పవర్

MARKAPURAM మార్కాపురం

మార్కాపురం - ప్రకాశం

# చీకటిలో.. ఉమ్మడివరం..!

**నెల రోజులుగా వీధి దీపాలు కరువు..**

**పట్టించుకోని అధికారులు!**

**పాములు, తేళ్ల సంచారంతో గ్రామస్తుల బెంబేలు..**

**అంధకారంలో ఎస్సీ కాలనీ**



**పుల్లల చెరువు పెన్ పవర్ అక్టోబర్ 13**

మండలంలోని ఉమ్మడివరం గ్రామంలో వీధి దీపాలు వెలగకపోవడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత నెల రోజులుగా గ్రామంలోని పలు ప్రాంతాలు చీకట్లోనే మగ్గుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి వేళల్లో రహదారులపై నడవాలన్నా, ఇళ్ల నుంచి బయటకు రావాలన్నా భయాందోళనకు గురవుతున్నామని వాపోతున్నారు. ముఖ్యంగా ఉమ్మడివరం ఎస్సీ కాలనీలో వీధి దీపాలు లేకపోవడంతో పరిస్థితి మరింత ఇబ్బందికరంగా మారిందని దళితవాడ ప్రజలు చెబుతున్నారు.

**నెల రోజులైనా వెలగని దీపాలు..:** గ్రామంలో వీధి దీపాలు వెలగకపోవడంతో రాత్రి వేళల్లో ఎటు చూసినా చీకటి అలుముకుంటోందని గ్రామస్తులు అంటున్నారు.సమస్యను పలుమార్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఇప్పటివరకు పరిష్కారం లభించలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శిస్తున్నారు. గ్రామాల్లో కనీస మౌలిక సదుపాయాలు కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉన్నప్పటికీ, వీధి దీపాల సమస్య నెల రోజులుగా పరిష్కారం కాకపోవడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు.

**పాములు, తేళ్లతో భయం..:** వీధి దీపాలు లేకపోవడంతో రాత్రి సమయాల్లో పాములు, తేళ్లు సంచరించే ప్రమాదం ఉందని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. చీకట్లో రహదారులపై అడుగు వేయాలంటేనే భయమేస్తోందని చెబుతున్నారు. అత్యవసర పరిస్థితుల్లో బయటకు వెళ్లాల్సి వచ్చినా చేతిలో టార్చ్ లైట్లు పట్టుకుని వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందని వాపోతున్నారు. చిన్నపిల్లలు, వృద్ధులు, మహిళలు రాత్రివేళల్లో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొంటున్నారు. ప్రమాదం జరిగిన తర్వాత స్పందించడం కంటే ముందుగానే సమస్యను పరిష్కరించాలని అధికారులను కోరుతున్నారు.

**అంధకారంలో ఎస్సీ కాలనీ ..:** ఉమ్మడివరం గ్రామంలోని ఎస్సీ కాలనీలో పరిస్థితి మరింత దయనీయంగా ఉందని స్థానిక దళితవాడ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలనీలో వీధి దీపాలు వెలగకపోవడంతో రాత్రివేళల్లో కటిక చీకటి అలుముకుంటోందని చెబుతున్నారు. తమ సమస్యలను అధికారులకు తెలియజేసినా పట్టించుకునే వారు కరువయ్యారని అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలోని ప్రజలందరికీ సమానంగా మౌలిక సదుపాయాలు కల్పించాల్సిన అవసరం ఉందని, ఎస్సీ కాలనీ సమస్యపై ప్రత్యేకంగా దృష్టి సారించి వెంటనే వీధి దీపాలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

**నిధులు ఎక్కడికి వెళ్లాయి..?**

గ్రామంలో వీధి దీపాల నిర్వహణ, మరమ్మతుల కోసం కేటాయించిన నిధుల వినియోగంపై కూడా స్థానికులు ప్రశ్నలు లేవనెత్తుతున్నారు.గ్రామానికి వచ్చిన నిధులను రాజకీయ నాయకులు, అధికారులు కుమ్మక్కై దుర్వినియోగం చేశారనే ఆరోపణలు గ్రామంలో వినిపిస్తున్నాయని స్థానికులు చెబుతున్నారు. అయితే ఈ ఆరోపణలపై సంబంధిత అధికారుల వివరణ తెలియాల్సి ఉంది. నిధులు ఎంత మంజూరయ్యాయి? వాటిని ఏ పనులకు ఖర్చు చేశారు? వీధి దీపాలు వెలగకపోవడానికి కారణమేంటి? అనే అంశాలపై అధికారులు స్పష్టత ఇవ్వాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.ప్రజలకు కనీస భద్రత కల్పించడంలో భాగంగా వీధి దీపాలు సక్రమంగా పనిచేసేలా చూడాల్సిన బాధ్యత సంబంధిత పంచాయతీ అధికారులపై ఉందని గ్రామస్తులు పేర్కొంటున్నారు. నెల రోజులుగా చీకట్లో జీవిస్తున్న తమ సమస్యను ఇకనైనా పరిష్కరించాలని కోరుతున్నారు. అధికారులు వెంటనే గ్రామాన్ని సందర్శించి, పనిచేయని వీధి దీపాలను మరమ్మతు చేయడంతో పాటు అవసరమైన చోట కొత్త దీపాలను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ఉమ్మడివరం గ్రామం, ముఖ్యంగా ఎస్సీ కాలనీలో నెలకొన్న అంధకార సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతారా? లేక గ్రామస్తులు మరికొంత కాలం చీకట్లోనే గడపాల్సి వస్తుందా? అన్నది వేచి చూడాల్సి ఉంది.

# అభివృద్ధి సాధనలో ప్రకాశం జిల్లాను అగ్రస్థానంలో నిలపాలి

**- జిల్లా కలెక్టర్ రాజాబాబు - స్మిత జే కుట్టు కట్ బృందానికి**

**జిల్లా అభివృద్ధికి గల అపార అవకాశాల గురించి వివరించిన జిల్లా కలెక్టర్**



**స్టాఫ్ రిపోర్టర్, పెన్ పవర్ అక్టోబర్ 13**

రాష్ట్ర అభివృద్ధిని వేగవంతం చేసే దిశగా ప్రభుత్వం చేపడుతున్న ప్రాంతీయ ఆర్థిక అభివృద్ధి ప్రణాళికలో భాగంగా ప్రకాశం జిల్లా సమగ్ర స్వరూపాన్ని మార్చేందుకు పటిష్టమైన చర్యలు ప్రారంభమయ్యాయి. స్థానిక కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో మంగళవారం సీఆర్‌డీఏ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ శాఖలకు చెందిన ఉన్నతస్థాయి అధ్యయన బృందంతో జిల్లా కలెక్టర్ ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. స్మిత జె కుట్టుకట్ నేతృత్వంలోని ముగ్గురు సభ్యుల నిపుణుల టీమ్ జిల్లాలోని ఆర్థిక, పారిశ్రామిక అభివృద్ధి అవకాశాలపై అధ్యయనం చేయడానికి ఇక్కడికి విచ్చేసింది. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ పి. రాజా బాబు మాట్లాడుతూ, ప్రకాశం జిల్లాలో దాగి ఉన్న మూడు సెక్టార్లలోని (వ్యవసాయం, పరిశ్రమలు, సేవ రంగం)అపారమైన అభివృద్ధి అవకాశాలను వెలికితీయడం, ఇక్కడి సహజ సిద్ధమైన వనరులను అమరావతి రీజియన్‌లోని పొరుగు జిల్లాల వనరులతో అనుసంధానించడమే ఈ నివేదిక ప్రధాన ఉద్దేశమని స్పష్టం చేశారు. బిపిసిఎల్ , ఇండోసోల్ వంటి భారీ పరిశ్రమలు, ఇతర ప్రముఖ సంస్థలు రాష్ట్రంలో పెద్ద ఎత్తున పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వస్తున్నాయి. ముఖ్యంగా రామాయపట్నం వద్ద పోర్టు నిర్మాణంతో పాటు దానికి అవసరమైన అనుబంధ మౌలిక సదుపాయాల కల్పనకు తగిన చర్యలు తీసుకోవడం జరిగిందని అధికారులు వెల్లడించారు. భారీ పరిశ్రమల రాక, రామాయపట్నం పోర్టు సేవలు ప్రారంభం కావడం వల్ల వాటి ఆధారిత అనుబంధ సంస్థలు, డౌన్‌స్ట్రీమ్ పరిశ్రమలు విస్తృతంగా ఏర్పాటు కానున్నాయి. ?ఈ ప్రాజెక్టులు అనుబంధ సంస్థల ద్వారా స్థానిక యువతకు ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలాది ఉపాధి, ఉద్యోగ అవకాశాలు మెరుగుపడతాయని వివరించారు. జిల్లాలో పారిశ్రామిక పురోగతికి, మౌలిక సదుపాయాల విస్తరణకు, పెట్టుబడుల ఆకర్షణకు అడ్డంకిగా మారిన క్షేత్రస్థాయి సాంకేతిక, ఆర్థిక ప్రతిబంధకాలను తొలగించడంపై కలెక్టర్ స్వయంగా సమగ్ర డేటా, గ్రాఫికల్ విశ్లేషణతో కూడిన పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా అధ్యయన బృందానికి దిశానిర్దేశం చేశారు. రవాణా సదుపాయాల మెరుగుదల, లాజిస్టిక్స్ పెంపు, ఎగుమతి ఆధారిత పరిశ్రమల ఏర్పాటుకు ప్రకాశం జిల్లా ఎంతగానో అనుకూలమైనదని నొక్కిచెప్పారు. ?ముఖ్యంగా జిల్లాలోని గనుల శాఖ , ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ , పరిశ్రమల శాఖ, ఉద్యానవన శాఖ, సాగునీటి ప్రాజెక్టుల శాఖ, రోడ్లు భవనాల శాఖ , మత్స్య శాఖ, వ్యవసాయ శాఖ సూక్ష్మ సేద్య అభివృద్ధి సంస్థ వంటి కీలక శాఖలను ఒకే వేదికపైకి తెచ్చి, అంతర - శాఖల సమన్వయం సాధించడం ద్వారా ఆర్థిక పురోగతిని పరుగులు తీయించవచ్చని కలెక్టర్ తెలిపారు. క్షేత్రస్థాయి పర్యటనలు, గణాంకాల ఆధారంగా ఈ అధ్యయన బృందం కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలకు ఒక నమూనా నివేదికను సమర్పిస్తుందని, దాని ఆధారంగా ప్రకాశం జిల్లా ప్రత్యేక పారిశ్రామిక ప్యాకేజీలు, మౌలిక ప్రాజెక్టులు, ఆర్థిక కేటాయిం పులను పొందుతుందని వివరించారు. ఈ సమావేశంలో జిల్లా ముఖ్య ప్రధాన ప్రణాళికాధికారి సుధాకర్ రెడ్డి , ఏపిఎంఐపి జెడ్ ఎం మదన్ మోహన్, పరిశ్రమల శాఖ అధికారి శ్రీనివాసరావు, లతో పాటు సంబంధిత శాఖల జిల్లా అధిపతులు, రీజినల్ ప్లానింగ్ నిపుణులు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



# కాక రేపుతున్న కందుకూరు మున్సిపల్ ఎన్నికలు!

**- వైసీపీకి అభ్యర్థుల కొరత.. -టీడీపీలో టికెట్ల కోసం తీవ్రమైన పోటీ**

**-ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుకు అగ్నిపరీక్ష - చైర్మన్ అభ్యర్థి ఎంపికపైనే అందరి దృష్టి**



**కందుకూరు పెన్ పవర్, అక్టోబర్ 13:**

కందుకూరు మున్సిపాలిటీ ఎన్నికల వేడి క్రమంగా రాజుకుంటోంది. సుమారు 14 సంవత్సరాల తర్వాత జరగనున్న మున్సిపల్ ఎన్నికలపై పట్టణ రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది. ఎన్నికలకు సిద్ధమవుతున్న ప్రధాన రాజకీయ పార్టీలు, ఆశావహులు తమ వ్యూహాలకు పదును పెడుతుండగా, ముఖ్యంగా అధికార కూటమిలోని తెలుగుదేశం పార్టీ టికెట్ల కోసం ఆశిస్తున్న నాయకుల మధ్య పోటీ తీవ్రంగా మారుతున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది. మరోవైపు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఆశించిన స్థాయిలో అభ్యర్థులు దొరకడం లేదనే ప్రచారం రాజకీయంగా చర్చనీయాంశమైంది.

**టీడీపీలో టికెట్ల కోసం పోటాపోటీ!**

కందుకూరు మున్సిపాలిటీలో చైర్మన్ పీఠాన్ని దక్కించుకోవాలనే లక్ష్యంతో తెలుగుదేశం పార్టీ నేతలు పావులు కదుపుతున్నారు. పార్టీ తరఫున పోటీ చేసేందుకు పలువురు నాయకులు ఆసక్తి చూపుతుండగా, ముఖ్యంగా ఐదుగురు ఆశావహులు టికెట్ల కోసం ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. దీంతో ఎవరికి అవకాశం దక్కుతుంది? ఎవరికి పార్టీ అధిష్ఠానం అండగా నిలుస్తుంది? అన్న అంశాలు పట్టణ రాజకీయాల్లో హాట్‌టాపిక్‌గా మారాయి.

టికెట్ ఆశిస్తున్న వారిలో ఉప్పుటూరి శ్రీనివాసరావు, పిడికిటి వెంకటేశ్వర్లు పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. వీరిద్దరి ప్రయత్నాలు, పార్టీ నాయకత్వం తీసుకునే నిర్ణయం ఎలా ఉండబోతున్నాయన్నది ఆసక్తికరంగా మారింది. అయితే ఐదుగురు ఆశావహుల మధ్య పోటీ నేపథ్యంలో పార్టీ ఎవరిని ఎంపిక చేస్తుందనేది ప్రస్తుతం ఉత్కంఠ రేపుతోంది.

**ఎమ్మెల్యే ఇంటూరికి అసలైన పరీక్ష!**

కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుకు ఈ మున్సిపల్ ఎన్నికలు రాజకీయంగా కీలకంగా మారనున్నాయి. పార్టీ శ్రేణులను సమన్వయం చేయడం, ఆశావహుల మధ్య పోటీని సద్దుమణిగేలా చూడటం, అన్ని వర్గాలకు సముచిత ప్రాధాన్యం కల్పించడం ఆయనకు సవాలుగా నిలవనుంది. ముఖ్యంగా చైర్మన్ అభ్యర్థి ఎంపికలో ఎలాంటి నిర్ణయం తీసుకుంటారన్నది రాజకీయ వర్గాల్లో ఆసక్తిని పెంచుతోంది. పార్టీ విజయావకాశాలను దృష్టిలో ఉంచుకుని అభ్యర్థిని ఎంపిక చేయడంతో పాటు, టికెట్ దక్కని నాయకులను అసంతృప్తికి గురికాకుండా చూడటం కూడా కీలకం కానుంది. అభ్యర్థి ఎంపికలో ఏ చిన్న పొరపాటు జరిగినా దాని ప్రభావం ఎన్నికల ఫలితాలపై పడే అవకాశం ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఉప్పుటూరి, పిడికిటి లను కాకుండా ఆర్యవైశ్యులకు ఏమైనా అవకాశం ఇస్తారా అనేది వేచి చూడాలి. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే ఇంటూరి తీసుకునే నిర్ణయంపైనే అందరి దృష్టి కేంద్రీకృతమైంది.

**ఆర్యవైశ్య వర్గాల్లోనూ ఆశలు!**

మున్సిపల్ చైర్మన్ పదవిని ఆశిస్తున్న వర్గాల్లో ఆర్యవైశ్యులూ ఉన్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. సామాజిక సమీకరణాలు, స్థానికంగా నాయకుల బలం, పార్టీకి ఉన్న అనుకూలత వంటి అంశాలు అభ్యర్థి ఎంపికలో ప్రాధాన్యం సంతరించుకునే అవకాశముంది. దీంతో చైర్మన్ పదవికి ఎవరిని ఎంపిక చేస్తారన్న అంశం మరింత ఆసక్తికరంగా మారింది.

**వైసీపీ వ్యూహం ఏమిటి?**

మరోవైపు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ ఎన్నికల్లో ఎలాంటి వ్యూహంతో ముందుకు సాగుతుందన్నది కూడా చర్చనీయాంశంగా మారింది. ఆ పార్టీకి అభ్యర్థుల కొరత ఉందన్న ప్రచారం వినిపిస్తున్నప్పటికీ, ఎన్నికల నాటికి పరిస్థితులు ఎలా మారుతాయో చూడాలి. టిడిపి అభ్యర్థిని బట్టి వైసీపీ అభ్యర్థిని ప్రకటిస్తామని వైసిపి నాయకులు దీమాగా ఉన్నారు.అభ్యర్థుల ఎంపిక, స్థానిక నాయకుల సమన్వయం, ప్రజల్లోకి తీసుకెళ్లే అంశాల ఆధారంగా ఆ పార్టీ పోటీ తీరు స్పష్టమయ్యే అవకాశం ఉంది.

**చైర్మన్ పీఠంపై టీడీపీ ధీమా.. అసలు పోటీ అభ్యర్థి ఎంపికలోనేనా?**

కందుకూరు మున్సిపాలిటీలో చైర్మన్ పీఠాన్ని కైవసం చేసుకోవడం టీడీపీకి సులభమనే ధీమా పార్టీ వర్గాల్లో వ్యక్తమవుతున్నప్పటికీ, ఎన్నికల ఫలితాలను ముందుగానే అంచనా వేయలేం. కందుకూరు మున్సిపాలిటీలో విలీన గ్రామాలు కలవడంతో టిడిపికి కలిసొచ్చే అంశంగా పరిగణిస్తున్నారు. ప్రజల తీర్పుతోపాటు అభ్యర్థుల ఎంపిక, స్థానిక సమస్యలు, పార్టీ శ్రేణుల ఐక్యత కీలక పాత్ర పోషించనున్నాయి. మొత్తానికి, 14 సంవత్సరాల తర్వాత జరగనున్న కందుకూరు మున్సిపల్ ఎన్నికలు పట్టణ రాజకీయాల్లో కొత్త సమీకరణాలకు తెరతీస్తున్నాయి. వైసీపీ అభ్యర్థుల ఎంపిక ఎలా ఉండబోతోంది? టీడీపీలో టికెట్ ఎవరిని వరిస్తుంది? చైర్మన్ పీఠంపై ఎవరు కూర్చుంటారు? అన్న ప్రశ్నలకు సమాధానం దొరకాలంటే మరికొంతకాలం వేచి చూడాల్సిందే. అయితే ప్రస్తుతానికి కందుకూరు మున్సిపల్ ఎన్నికల్లో అసలు కాక రేపుతున్న అంశం మాత్రం టీడీపీలో చైర్మన్ అభ్యర్థి ఎంపికే అనడంలో సందేహం లేదు.

# రేషన్ డీలర్ల సమస్యలు పరిష్కరించాలి

### తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించిన డీలర్లు



**సంతమాగులూరు, పెన్ పవర్, అక్టోబర్ 13**

రాష్ట్రవ్యాప్తంగా రేషన్ డీలర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సంతమాగులూరు మండల రేషన్ డీలర్ల అసోసియేషన్ నాయకులు మంగళవారం తహసీల్దార్ కే. రవిబాబుకు వినతిపత్రం సమర్పించారు. రాష్ట్ర సమాఖ్య రూపొందించిన కార్యాచరణలో భాగంగా మండలంలోని రేషన్ డీలర్లు ఈ కార్యక్రమంలో పాల్గొని, తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు వినతిపత్రం అందజేశారు. డీలర్ల సమస్యల పరిష్కారానికి సమాఖ్య చేపట్టిన కార్యాచరణను రాష్ట్రవ్యాప్తంగా ఒకే రోజు అమలు చేయాలని నిర్ణయించిన నేపథ్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. తదుపరి కార్యాచరణలో భాగంగా ఈ నెల 15న జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించనున్నారు. ఈ కార్యక్రమంలో సంతమాగులూరు మండల డీలర్ల అసోసియేషన్ అధ్యక్షుడు జూటూరి ఆదినారాయణ, కార్యదర్శి చింతా గోవిందు, ఉపాధ్యక్షుడు అనంతవరపు శ్యాంబాబు, గంగినేని శ్రీనివాసరావు, షేక్ అల్లాబక్షు, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# పొదిలిలో యువకుడి అనుమానాస్పద మృతి



**పొదిలి, పెన్ పవర్, అక్టోబర్ 13**

పొదిలిలో ఒక యువకుడి అనుమానాస్పద మృతి జరిగింది. పట్టణంలోని విశ్వనాధపురం ప్రాంతంలో గల లాడ్జిలో ఒక యువకుడు అనుమానస్పదంగా మృతి చెందడం జరిగింది. ఈ సంఘటన పట్టణంలో కలకలం రేపింది. పొదిలి పట్టడానికి చెందిన సయ్యద్ కరిముల్లా అనే 23 సంవత్సరాల యువకుడు లాడ్జిలో మంగళవారం ఉదయం అపస్మారక స్థితిలో పడి ఉండటం జరిగింది. ఈ విషయాన్ని లాడ్జి నిర్వాహకులు పోలీసులకు సమాచారం అందించడంతో ఎస్ ఐ సూ రెడ్డి రాజేష్ లాడ్జి కి వెళ్లి పరిశీలించారు. అపస్మారక స్థితిలో ఉన్న యువకుడిని వైద్య చికిత్స నిమిత్తం ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా అతను మరణించాడు. ఈ సంఘటనపై పొదిలి ఎస్ ఐ రాజేష్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు. యువకుడి మరణానికి గల కారణాలు పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది.

# గ్రామీణాభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి

### ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి



**కొనకనమిట్ల పెన్ పవర్ అక్టోబర్ 13**

మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పిస్తామని మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు.మంగళవారం కొనకనమిట్ల మండలం వెలిగండ్ల గ్రామంలో తెలుగుదేశం పార్టీ జెండాను ఆవిష్కరించిన ఆయన,పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా రూ.22 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్లకు శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ నియోజకవర్గంలో అభివృద్ధి,సంక్షేమ కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తున్నామని తెలిపారు.గత ప్రభుత్వ హయాంలో అభివృద్ధి నిర్లక్ష్యానికి గురైందని విమర్శించారు.ప్రస్తుత ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యతనిస్తూ రహదారుల నిర్మాణం చేపడుతోందన్నారు.రానున్న రోజుల్లో మండలాన్ని మరింత అభివృద్ధి చేసి ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో మండల నాయకులు,గ్రామ పార్టీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# మలినేని ఫార్మసీ కళాశాలలో రాష్ట్రీయ ఇన్నోవేషన్ ఛాలెంజ్--2026

### --విద్యార్థుల వినూత్న ఆలోచనలకు వేదికగా ఐడియాథాన్, హ్యాకథాన్

### --సమాజ సమస్యలకు ఆచరణాత్మక పరిష్కారాలు కనుగొనడమే లక్ష్యం





**కందుకూరు పెన్ పవర్, అక్టోబర్ 13:**

సింగరాయకొండలోని మలినేని లక్ష్మయ్య కాలేజ్ ఆఫ్ ఫార్మసీలో రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్--అమరావతి సహకారంతో మంగళవారం రాష్ట్రీయ ఇన్నోవేషన్ ఛాలెంజ్--2026 (ఐడియాథాన్, హ్యాకథాన్) కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ వినూత్న ఆలోచనలు, సృజనాత్మక పరిష్కారాలను ప్రదర్శించారు. సమాజం ఎదుర్కొంటున్న వివిధ సమస్యలకు నూతన ఆవిష్కరణల ద్వారా ఆచరణాత్మక పరిష్కారాలను కనుగొనడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు. ముఖ్యంగా ఆరోగ్యం, వైద్యం, పారిశుధ్యం, వ్యర్థాల నిర్వహణ, వ్యవసాయం, గృహ నిర్మాణం, విద్యుదీకరణ వంటి కీలక రంగాల్లో సమస్యలను గుర్తించి, వాటికి ఉపయోగకరమైన పరిష్కారాలను రూపొందించడంపై విద్యార్థులు దృష్టి సారించారు.ఈ కార్యక్రమానికి మలినేని విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ ఎ.జి.కె. మూర్తి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు నూతన ఆవిష్కరణలపై ఆసక్తి పెంపొందించుకోవాలని, తమ ఆలోచనలను ఆచరణలో పెట్టేందుకు కృషి చేయాలని సూచించారు. విద్యార్థుల్లో సృజనాత్మకత, పరిశోధనా దృక్పథం పెంపొందినప్పుడే సమాజ అభివృద్ధికి దోహదపడే నూతన పరిష్కారాలు వెలుగులోకి వస్తాయని పేర్కొన్నారు. యువత తమ ప్రతిభను సామాజిక సమస్యల పరిష్కారానికి వినియోగించాలని పిలుపునిచ్చారు.కళాశాల చైర్మన్ డాక్టర్ మలినేని పెరుమాళ్లు ప్రోత్సాహం, సహకారంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి.హెచ్. సాయిబాబు మాట్లాడుతూ, ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో పరిశోధనా ఆసక్తిని, సాంకేతిక పరిజ్ఞానాన్ని, సమస్యలను విశ్లేషించి పరిష్కారాలను రూపొందించే నైపుణ్యాలను పెంపొందిస్తాయని తెలిపారు. విద్యార్థులు తమ ఆలోచనలను నూతన ఆవిష్కరణలుగా మలచుకోవడానికి ఐడియాథాన్, హ్యాకథాన్ వంటి వేదికలు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు.వివిధ కళాశాలల విద్యార్థుల భాగస్వామ్యంతో నిర్వహించిన ఈ రాష్ట్రీయ ఇన్నోవేషన్ ఛాలెంజ్ యువతలో ఆవిష్కరణల పట్ల ఆసక్తిని పెంపొందించడంతో పాటు, సమాజానికి ఉపయోగపడే సృజనాత్మక పరిష్కారాల రూపకల్పనకు దోహదపడింది. విద్యార్థుల ఆలోచనా శక్తిని, ప్రతిభను వెలికితీసే కార్యక్రమంగా ఇది నిలిచింది.

# కందుకూరులో సేవా సంకల్ప్ అభియాన్

### -అంగన్వాడీ సిబ్బందికి సన్మానం



**కందుకూరు పెన్ పవర్, అక్టోబర్ 13:**

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న సేవా సంకల్ప్ అభియాన్‌లో భాగంగా మంగళవారం కందుకూరు పట్టణంలోని పడమటి మంగళపాలెం కమ్యూనిటీ హాల్‌లో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని అంగన్వాడీ సిబ్బందిని శాలువాలతో సత్కరించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్య పరిరక్షణలో అంగన్వాడీ సిబ్బంది కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. గర్భిణులకు పౌష్టికాహారం అందించడం, క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవడం, తల్లీబిడ్డల ఆరోగ్యంపై అవగాహన కల్పించడం ఎంతో ముఖ్యమని తెలిపారు. మహిళలు, చిన్నారుల సంక్షేమం కోసం అంగన్వాడీ సిబ్బంది అందిస్తున్న సేవలు అభినందనీయమని కొనియాడారు.ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన వారికి చేరవేయడంలో అంగన్వాడీ సిబ్బంది చేస్తున్న కృషి ప్రశంసనీయమని, సమాజంలో ఆరోగ్య అవగాహన పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయని అన్నారు. సేవా సంకల్ప్ అభియాన్ ద్వారా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజలకు, ముఖ్యంగా మహిళలు మరియు చిన్నారులకు మరింత చేరువ కావడమే లక్ష్యమని పేర్కొన్నారు.బీజేపీ ప్రకాశం జిల్లా ఉపాధ్యక్షుడు ఉన్నం భాస్కరరావు సౌజన్యంతో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ శాఖ అధ్యక్షుడు చుండి మురళీధర్, జొన్నాదుల సురేష్, పట్టణ శాఖ ప్రధాన కార్యదర్శి రావి సరిత, జిల్లా కార్యవర్గ సభ్యురాలు తల్లపనేని అంజమ్మ, పట్టణ ఓబీసీ మోర్చా అధ్యక్షురాలు నల్లమోతుల నాగరాజ కుమారి, సీడీపీఓ ఉషారాణి, అంగన్వాడీ బి సెక్టార్ సూపర్‌వైజర్ షకీలా బేగం, అంగన్వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

# 6 కుటుంబాలు టిడిపిలో చేరిక





**లింగసముద్రం పెన్ పవర్, అక్టోబర్ 13**

మండలంలోని మొగిలిచర్ల గ్రామానికి చెందిన 6 కుటుంబాల వారు.. కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సమక్షంలో మంగళవారం తెలుగుదేశం పార్టీలో చేరారు. పల్లాల శివయ్య, పల్లాల నారాయణరెడ్డి, పిచ్చపాటి వెంకటయ్య, పల్లాల వీరబ్రహ్మయ్య, రొడ్డ యేసుదాసులకు ఎమ్మెల్యే నాగేశ్వరరావు పసుపు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఎమ్మెల్యే నాగేశ్వరరావు ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, ఆయన చిత్తశుద్ధి తమను ఎంతగానో ఆకర్షించాయని, ఇకనుంచి ఆయన అడుగుజాడల్లో పనిచేస్తామని కొత్తగా చేరిన వారు తెలిపారు. రాబోయే ఎన్నికల్లో గెలుపు కోసం కృషి చేస్తామని చెప్పారు. గ్రామ నాయకులు పల్లపోతు వెంగళరావు, నీటి సంఘం చైర్మన్ బాసం పెద మాలకొండయ్య, వేముల రామారావు, కంచర్ల రవీంద్ర, పెన్నా మల్లికార్జున, పోకూరి కొండలరావు, ఓరుగంటి అనిల్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ప్రకృతి వ్యవసాయంతో అదనపు ఫల సాయం

### – జిల్లాలోని ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను సందర్శించిన ఎం ఎస్. స్వామినాథన్ పరిశోధన సంస్థ బృందం





**ఒంగోలు కలెక్టరేట్, పెన్ పవర్ అక్టోబర్ 13**

రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో అమలవుతున్న ఆంధ్రప్రదేశ్ ప్రజా భాగస్వామ్య ప్రకృతి వ్యవసాయ కార్యక్రమంలో భాగంగా, జిల్లా ప్రాజెక్టు మేనేజర్ సుభాషిణి పర్యవేక్షణలో ఎం.ఎస్. స్వామినాథన్ పరిశోధనా సంస్థకు చెందిన ఏడుగురు సభ్యుల బృందం జిల్లాలోని ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను సందర్శించింది. తొలుత కందులూరు గ్రామంలో రైతు కాట్రగడ్డ లక్ష్మి సాగు చేస్తున్న కంది ఏ–గ్రేడ్ నమూనా క్షేత్రాన్ని పరిశీలించి, నవధాన్యాల సాగు, విత్తన గుళికల వినియోగం, దోస అంతర పంట సాగు ద్వారా పొందుతున్న అదనపు ఆదాయం గురించి తెలుసుకున్నారు. అనంతరం రైతు దాసయ్య మామిడి తోటను సందర్శించి, అంతర పంటల సాగు విధానాలు, పంటల నిర్వహణ, ఆదాయ వివరాలను అడిగి తెలుసుకున్నారు. తదుపరి కొత్తపట్నం గ్రామంలోని అంకమ్మతల్లి జీవ వనరుల కేంద్రాన్ని సందర్శించిన బృందానికి, కేంద్రం సభ్యులు కషాయాలు, ద్రావణాల తయారీ విధానాన్ని ప్రదర్శించి వివరించారు. అలాగే ప్రకృతి వ్యవసాయంలోని తొమ్మిది సార్వత్రిక సూత్రాలను వివరించి, వాటి ప్రాముఖ్యతను తెలియజేశారు. అనంతరం రైతులు రామలింగం, జ్యోతి, కాటా సురేంద్ర సాగు చేస్తున్న ప్రకృతి వ్యవసాయ పంటలను పరిశీలించి, రసాయన వ్యవసాయానికి, ప్రకృతి వ్యవసాయానికి మధ్య ఉన్న తేడాలు, సాగు పద్ధతులు, రైతుల అనుభవాల గురించి అడిగి తెలుసుకున్నారు. మహిళా సంఘాల ద్వారా ప్రకృతి వ్యవసాయాన్ని ఎలా ముందుకు తీసుకెళ్తున్నారో మహిళా సంఘ సభ్యులతో బృందం నేరుగా మాట్లాడి తెలుసుకుంది. ఆరోగ్యం, పోషకాహార విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రకృతి వ్యవసాయ ఫుడ్ బాస్కెట్ కార్యక్రమాన్ని పరిశీలించి, లబ్ధిదారులతో మాట్లాడి వారు పొందుతున్న ప్రయోజనాలు, వినియోగిస్తున్న ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల వివరాలను సేకరించింది. ఈ కార్యక్రమంలో పరిశోధనా సంస్థ బృంద సభ్యులు, రైతు సాధికార సంస్థ రాష్ట్ర కార్యాలయ ప్రతినిధులు, జిల్లా ప్రాజెక్టు మేనేజర్ సుభాషిణి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

# ఎన్.ఎస్.ఎస్ ప్రత్యేక శిబిరాన్ని ప్రారంభించిన.. కదిరి పార్ధసారధి



**సి ఎస్ పురం, పెన్ పవర్ అక్టోబర్ 13**

సిఎస్ పురం కదిరి బాబురావు వ్యవసాయ కళాశాల విద్యార్థులు స్టూడెంట్ రెడీ ప్రోగ్రామ్ 2026--27 విద్యాసంవత్సరంలో భాగంగా రావెప్ విద్యార్థులు ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరాన్ని ఏర్పాటు చెశారు. మంగళవారం శీలంవారిపల్లి కమ్యూనిటీ హాల్ లో నందు ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని కళాశాల సెక్రటరీ కరెస్పాండంట్ కదిరి పార్ధసారధి ప్రారంభించారు.ఈ సందర్భంగా పార్ధసారధి మాట్లాడుతూ ఎన్ ఎస్ ఎస్ ముఖ్య ఉద్దేశం విద్యార్థులలో అవగాహన కల్పించడం, సామాజిక భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడం మరియు సామాజిక బాధ్యతను పెంపొందించడం గురించి తెలియజేసారు. గ్రామీణాభివృద్ధి కోసం విద్యార్థులు చేపట్టిన వివిధ కార్యక్రమాలను వివరించారు.ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న విద్యార్థులను అభినందించారు.అదేవిదంగా కళాశాల డీన్ డాక్టర్ కె మోష మాట్లాడుతూ రావెప్ విద్యార్థులు జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) ప్రాముఖ్యతను వివరించి వారం రోజుల పాటు జరిగే ఈ ప్రత్యేక శిబిరంలో ప్రణాళిక చేయబడిన వివిధ సామాజిక కార్యక్రమాల గురించి గ్రామస్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమం లో అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది,నారాయణ స్వామి దేవస్థానం ట్రస్ట్ బోర్డు మాజీ చైర్మన్ దుగ్గిరెడ్డి జయరెడ్డి,ముడియాల నారాయణ రెడ్డి,మాజీ ఎంపీటీసీలు మునగల నారాయణ రెడ్డి, మూరం కాశిరెడ్డి, తికణం బాబురావు,కొట్టే శ్రీను,టి లక్ష్మి నారాయణ,దుగ్గని రోశయ్య,కొట్టే అంకయ్య, ఇరగని మాధవరావు,కదిరి ప్రసాద్,గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

# ఒంగోలు నగరంలోని ఎస్సీ జనాభాలో 70 శాతం మాదిగలే

### – ఒంగోలు మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో మాదిగలకు 6 కార్పొరేటర్ సీట్లతో పాటు డిప్యూటీ మేయర్ సీటు కేటాయించాలి

### – మాదిగ సంక్షేమ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు కొమ్ము సుజన్ మాదిగ డిమాండ్



**ఒంగోలు క్రైమ్, పెన్ పవర్ అక్టోబర్ 13**

ఒంగోలు మునిసిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో, మాదిగలకు జనాభా దామాషా ప్రకారం కార్పొరేటర్ సీట్లు అన్ని రాజకీయ పార్టీలు ఇవ్వాలని మాదిగ సంక్షేమ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు కొమ్ము సుజన్ మాదిగ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన ఒంగోలులోని ఎమ్మెస్ పిఎస్ కార్యాలయంలో మాట్లాడుతూ,ఒంగోలు నగరంలో ఎస్సీ జనాభాలో 70 శాతం మంది మాదిగలే ఉన్నారని, మొత్తం 11 రిజర్వ్ స్థానాలు ఉంటే, అందులో కనీసం 6 స్థానాలు మాదిగలకు ఇవ్వాలని ఆయన కోరారు. సుప్రీం కోర్టు ఎస్సీ వర్గీకరణకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినా, అధికార పార్టీలు మాత్రం పాత పద్ధతిలోనే మాల సామాజిక వర్గానికి అన్నీ సీట్లు కట్టబెడుతున్నారని, ఇది సామాజిక న్యాయానికి విరుద్ధం అన్నారు. కార్పొరేట్ సీట్లతో పాటుగా, ఒంగోలు డిప్యూటీ మేయర్ పదవిని మాదిగలకు కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. స్థానిక ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్దన్ రావు విజయానికి కృషి చేసింది మాదిగలేనని ఆయన గుర్తు చేశారు. తెలుగుదేశం, జనసేన, బిజెపి కూటమి పార్టీలకు, ఓట్లు వేసిన మాదిగలకు రాబోయే కార్పొరేషన్ ఎన్నికల్లో మా జనాభా దామాషా ప్రకారం కార్పొరేటర్ సీట్లు ఇచ్చి సముచితస్థానం కల్పించాలని సుజన్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సుజన్ మాదిగ తో పాటు, జయరాజ్ మాదిగ, సింగయ్య మాదిగ, బాలాజీ మాదిగ, ఆనంద్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లను తప్పనిసరిగా పాటించాలి

## - నిబంధనలకు విరుద్ధంగా ఎటువంటి సిఫార్సులను ఆమోదించవద్దు

## - కలెక్టర్లకు అధికారులకు రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ సాయి ప్రసాద్ సూచన





**స్టాఫ్ రిపోర్టర్, పెన్ పవర్ అక్టోబర్ 13**

స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ బి. సాయి ప్రసాద్ , పి ఆర్ అండ్ ఆర్ డి స్పెషల్ సీఎస్ కాంతిలాల్ దండే, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్మెంట్ కమిషనర్ కృష్ణ తేజ తదితరులతో కలిసి జిల్లా కలెక్టర్లు.. జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వాహణ అధికారి, సంబంధిత అధికారులతో మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ పి. రాజబాబు కలెక్టర్ కార్యాలయంలోని విసి హాల్ నుండి పాల్గొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలలో రిజర్వేషన్ ప్రక్రియలో భాగంగా ముందుగా ఎస్టి, ఎస్సీ, బిసి మరియు మహిళా రిజర్వేషన్లను విధిగా పాటించాలని ఈ సందర్భంగా చీఫ్ సెక్రటరీ అధికారులకు సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా ఎటువంటి చర్యలు తీసుకోవద్దని, సిఫార్సులను ఆమోదించవద్దని ఈ సందర్భంగా ఆయన సూచించారు. ఎస్సీ ,ఎస్టీ రిజర్వేషన్లకు సంబంధించి 2011 సెన్సెస్ గణాంకాలను ఆధారంగా చేసుకోవాలని ఆయన ఈ సందర్భంగా తెలిపారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన ముందస్తు చర్యలు తీసుకోవాలని అందులో భాగంగా పోలింగ్ సిబ్బంది ఏర్పాటు ,రూట్ ఆఫీసర్లు జోనల్ ఆఫీసర్, నియామకం చేపట్టాలన్నారు. వార్డు, మండలం జిల్లాలకు సంబంధించి నివేదికలను త్వరితగతిన ఈరోజు సాయంత్రం లోపు ఆయన సూచించారు. ఎన్నికల ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి పి. వెంకటరమణ , బీసీ కార్పొరేషన్ ఈడీ వెంకటేశ్వరరావు, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి చిరంజీవి,, ఒంగోలు మున్సిపల్ కమిషనర్ వెంకట కృష్ణయ్య, డిపిఓ అనుపమ ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# పొదిలిలో ఆర్టీసీ కార్మికుల నిరసన దీక్ష



**పొదిలి, పెన్ పవర్, అక్టోబర్ 13**

ఆర్టీసీ కార్మికుల సమస్యల్ని పరిష్కరించాలని కోరుతూ పొదిలి లో కార్మికులు నిరసన దీక్ష చేస్తున్నారు. స్థానిక డిపో ఆవరణలో ఎంప్లాయిస్ యూనియన్ కు చెందిన కార్మికులు నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా మంగళవారం నాడు ఆ యూనియన్ కు చెందిన నాయకులు మాట్లాడుతూ సమస్యలు పరిష్కరించేంత వరకు మా నిరసన కార్యక్రమం, పోరాటం ఆగదని స్పష్టం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఆర్టీసీ కార్మికుల సమస్యల్ని పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు పి ఓబులేష్, పి కొండలరావు, పి ఎ యెన్ రెడ్డి తోపాటు సభ్యులు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి డోలాను మర్యాదపూర్వకంగా కలిసిన డ్వామా నూతన పి.డి విజయ్ కుమార్



**ఒంగోలు టౌన్, పెన్ పవర్ అక్టోబర్ 13**

తూర్పు నాయుడుపాలెం క్యాంపు కార్యాలయంలో మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి ని ప్రకాశం జిల్లా నూతన డ్వామా పీడి ఎం.వి. విజయ్ కుమార్ మర్యాద పూర్వకంగా కలిశారు.

## గిద్దలూరు మున్సిపాలిటీ వార్డుల రిజర్వేషన్ కేటాయింపు

**గిద్దలూరు, పెన్ పవర్ అక్టోబర్ 13**

రాష్ట్ర పురపాలన ఎన్నికల యంత్రాంగం సోమవారం విడుదల చేసిన ఉత్తర్వుల ప్రకారం గిద్దలూరు మున్సిపాలిటీలో మొత్తం 28 వార్డులుండగా ఆయా వార్డుల రిజర్వేషన్ వివరాలిలా ఉన్నాయి. గిద్దలూరు పట్టణంలోని 20 వ వార్డు ఎస్.టి-జనరల్ కేటగిరీకి కేటాయించగా, ఎస్ సి మహిళకు 10వ వార్డు,ఎస్.సి-జనరల్ కేటగిరీకి 15,16వ వార్డులను కేటాయించారు. బి.సి జనరల్ కేటగిరీలో కేటాయించిన ఐదు స్థానాలకు గాను12,19,21,24,26 వార్డులు, బి.సి మహిళ కేటగిరీకి ఐదు స్థానాలు లభించాయి. ఆ మేరకు 4,5,22,23,25 వార్డుల్లో బి.సి మహిళలు తలపడనున్నారు. ఎస్.టి, కేటగిరీలో మహిళకు కేటాయింపు జరక్కపోవడంతోజనరల్ మహిళల కేటగిరికి ఎనిమిది స్థానాలు దక్కాయి.జనరల్ మహిళల కోసం 1,2,7,9,11,14,27,28 రిజర్వు చేయబడ్డాయి. ఇక రిజర్వు కాని ఆరు స్థానాలు పూర్తి స్థాయి జనరల్ సీట్లుగా 3,6,8,13,17,18 వార్డులు పరిగణించబడ్డాయి.




# వార్డుల సరిహద్దులు క్షుణ్ణంగా తెలపండి

## -సిపిఐ ఆధ్వర్యంలో వినతి

**కందుకూరు పెన్ పవర్, అక్టోబర్ 13:**



కందుకూరు మున్సిపల్ పరిధిలో ఉన్న 32 వార్డులను 40 వార్డులుగా పునర్విభజన చేసి అభ్యంతరాలను తెలపాలని కందుకూరు మున్సిపల్ కమిషనర్ కె.అనూష ప్రకటించిన సందర్భంలో సిపిఐ బృందం మంగళవారం తమ అభ్యంతరాలను తెలియపరుస్తూ మున్సిపల్ మేనేజర్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి బూసి సురేష్ బాబు మాట్లాడుతూ మున్సిపల్ అధికారులు ప్రకటించిన 40 వార్డులు సామాన్య ప్రజలకు అర్థం కాని విధంగా ఉన్నాయని, ఎవరు ఏ వార్డులోకి వెళ్లారు అర్థం కాని అయోమయ పరిస్థితిలో ఉన్నారని అన్నారు. పరిపాలనా సౌలభ్యంగా వార్డుల విభజనలు ఉండాలని అయితే మున్సిపల్ అధికారులు ప్రకటించిన 40 వార్డుల విభజనలో అవకతవకులు ఉన్నాయని, వాటిని సరి చేస్తూ ప్రజలకు అర్థమయ్యే విధంగా సరిహద్దులను చూపాలని ఆయన కోరారు. గతంలో 13వ వార్డును సరిహద్దును పెంచుతూ చుట్టుగుంట, ముక్కోటి పాలెం, కంద్రా వారి పాలెం వరకు పొడిగించడం వలన అనేక ఇబ్బందులు ఎదురవుతాయ ని 13వ వార్డును యధావిధిగా ఉంచాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు వై ఆనందమోహన్, యు.మాధవరావు, సిహెచ్ దుర్గాప్రసాద్, బొల్లోజుల బాల బ్రహ్మాచారి తదితరులు ఉన్నారు.

# పంచాయితీలో ఉన్న సమస్యలకు పరిష్కారం చూపాలి

## - మాజీ సర్పంచ్ నన్నం పోతురాజు -పీ.జీ.ఆర్.ఎస్ వేదికలో అర్జీ అందజేత





**ఉలవపాడు, పెన్ పవర్, అక్టోబరు 13**

వీరేపల్లి గ్రామ పంచాయితీలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార (పి.జి.ఆర్.యస్) వేదికలో ఉలవపాడు మండల వైయస్సార్ కాంగ్రెసు పార్టీ అధ్యక్షులు, వీరేపల్లి మాజీ సర్పంచ్ నన్నం పోతురాజు పాల్గొని, గ్రామపంచాయతీ సంబంధించి, పంచాయతీలో ఉన్న సమస్యలు పై గ్రామ పంచాయతీ నందు అన్ని అవాస ప్రాంతాలలో ఉన్న పలు సమస్యలకు పరిష్కారం చూపాలని అర్జీ అందజేశారు. ముఖ్యముగా తూర్పు పెదయానాది సంఘం, రైలు కట్ట యానాది సంఘం లోని ప్రజలకు, ప్రైవేటు వ్యక్తులు మంచినీటి ట్యాంకుల ద్వారా సరఫరా చేస్తుంటే వారి దగ్గర కోనుగోలు చేసుకోని జీవణముసాగిస్తున్నారని పోతురాజు అర్జీలో తెలిపారు. అంతేకాకుండా నీటి సమస్య తీవ్రంగా ఉన్నందున పంచాయితీ నుండి ప్రజలకు ట్యాంక్ ద్వారా నీటిని సరఫరాచెయించమని, పంచాయితీ నందు విద్యుత్ దీపాలు చాలా చోట్ల పని చేయటం లేదని వెంటనే వాటిని ఏర్పాటు చేయాలని, డ్రైనేజీలలో పూడికలు తీయనందున సాయంత్రం దోమల బెడద ఎక్కువగా ఉందని, రాళ్లచేను కాలువా (పంట కాలువ మరియు డ్రైనేజీ కాలువఅయినందున) మురికి బయటకు వెళ్ళే మార్గం లేక కాలువలో స్టాక్ అయి పూడికలు తీయనందున దోమలు ఎక్కువగా యస్.సి కాలనీలలోని ప్రజలు, ముఖ్యంగా పసిపిల్లలు అనారోగ్యాలకు గురి అవుతున్నారని తెలిపారు. వెంటనే పరిష్కారం చేయమని, అదేవిధంగా గ్రామము లోని తూర్పు యానాది సంఘం కాలనీ వాసులకు, రాకపోకలకు 2005-2006 ఎస్ జె ఆర్ వై నిధులుతో గ్రావేల్ రోడ్డువేసి, యస్.టి ప్రజలుకు స్వాకర్యం కలిపించటంజరిగిందని, అయితే ఆ రోడ్డును తోలగించిన దానిపై ఇంతవరకు ఆ సమస్య పరిష్కారం కానందున ఈ భూములపై గ్రామ రెవిన్యూలోని సర్వే నెంబర్లు అయిన 329/1, 329/2 భూమి పై సమగ్ర విచారణ జరపవలసిందిగా అర్జీ రూపంలో కోరటం జరిగినదని మాజీ సర్పంచ్ పోతురాజు తెలియజేశారు.

# డీలర్ల సమస్యల్ని పరిష్కరించాలి



**పొదిలి, పెన్ పవర్, అక్టోబర్ 13**

డీలర్ల సమస్యల్ని పరిష్కరించాలని మండల డీలర్లు కోరారు. రాష్ట్ర డీలర్ల సంఘం అధ్యక్షులు ఆదేశాల మేరకు మంగళవారం నాడు పొదిలి మండల తహసిల్దార్ ఎం వి కృష్ణారెడ్డిని కలసి, తమ సమస్యల్ని ఆయన దృష్టికి తీసుకుని వెళ్లడంతో పాటు అందుకు సంబంధించిన వినతి పత్రాన్ని కూడా అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల డీలర్ల సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పాత మాగులూరులో అగ్నిప్రమాదం.. మూడు ఎకరాల వరిగడ్డి దగ్ధం



**సంతమాగులూరు, పెన్ పవర్, అక్టోబర్ 13**

సంతమాగులూరు మండలం పాత మాగులూరు గ్రామంలో మంగళవారం సాయంత్రం జరిగిన అగ్నిప్రమాదంలో రావులపల్లి శ్రీనివాసరావుకు చెందిన మూడు ఎకరాల వరిగడ్డి పూర్తిగా దగ్ధమైంది. మంటలు వ్యాపించడాన్ని గమనించిన స్థానికులు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించడంతో నరసరావుపేట అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. అయితే, అప్పటికే వరిగడ్డి పూర్తిగా కాలిపోయింది. దాదాపు 50 వేల రూపాయల మేర నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు తెలిపారు. ఈ ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

# చాముండేశ్వరి శరణు శరణు

**దొనకొండ అక్టోబర్ 13 పెన్ పవర్**

మండల కేంద్రంలోని విరాట్ నగర్ లో గల శ్రీ ఆనందాశ్రమంలో దసరా మహోత్సవంలో భాగంగా మూడవరోజు మహా చండేశ్వరి దేవిగా శ్రీ ఈశ్వరి మహదేవి దర్శనమిచ్చారు ఉదయం 6 గంటల నుండి అమ్మవారికి విశేషఅభిషేకాలు ప్రత్యేక అలంకరణ చేసి అమ్మవారికి అష్టోత్తర శతనామావళి సహస్రనామార్చన సామూహిక కుంకుమ పూజ నిర్వహించి కదంబ కట్టె పొంగలి మహానైవేద్యాలు సమర్పించి మహిళలచే సామూహిక హారతులు ఇచ్చారు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొంనారు వచ్చిన భక్తులకు ఆశ్రమ అర్చకులు మణి బాబు శర్మ తీర్థ ప్రసాదములు అంద చేశారు ఉభయ దాతలు దొనకొండ వాస్తవ్యులు గంగేంద్రం దానం కవిత దంపతులు పెదగుడిపాడు వాస్తవ్యులు మల్లాపురం బ్రహ్మయ్య నాగలక్ష్మి దంపతులు వచ్చిన భక్తులకు అల్పాహారం ఏర్పాటు చేశారు నాల్గవ రోజు శాకాంబరిగా శ్రీ ఈశ్వరీమహాదేవి దర్శనమిస్తుందని శ్రీ భైరవానంద స్వామి తెలియజేశారు.



# బాల్య వివాహాల నిరోధానికి అందరి సహకారం అవసరం

## ఎడమకల్లు గ్రామంలో పల్లెనిద్ర చేసి ప్రజలకు చట్టాలపై, నేరాలపై అవగాహన కల్పించిన గిద్దలూరు రూరల్ సీఐ జే రామకోటయ్య





**కొమరోలు పెన్ పవర్ అక్టోబర్ 13**

బాల్య వివాహాల నిరోధానికి అన్ని వర్గాల ప్రజలు తమ వంతుగా సహకరించాలని గిద్దలూరు రూరల్ సీఐ జే రామకోటయ్య ప్రజలకు విజ్ఞప్తి చేశారు. పోలీసుల పల్లె నిద్రలో భాగంగా మంగళవారం రాత్రి గిద్దలూరు రూరల్ సీఐ జే రామకోటయ్య,కొమరోలు ఎస్సై కోట నాగేంద్రరావు తమ సిబ్బందితో కొమరోలు మండలం ఇడమకల్లు గ్రామంలో పని నిద్ర చేశారు. ఆ గ్రామంలో ఆ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రజలను ఉద్దేశించి సీఐ రామకోటయ్య మాట్లాడుతూ, బాల్య వివాహాల వల్ల బాలికల జీవితాలు అంధకారం అవుతాయని, వారి ఉజ్వల భవిష్యత్తు అగమ్య గోచరంగా మారుతుందని తెలిపారు. చదువుకుంటూ ఉజ్వల భవిష్యత్తు వైపు పయనించే బాలికలను చదువులు అర్ధాంతరంగా నిలిపివేసి తల్లిదండ్రులు మూఢనమ్మకాలను ఆధారంగా చేసుకుని వివాహాలు చేయిస్తున్నారని ఆయన తెలిపారు. శారీరక మానసిక పరిపక్వతలేని వయస్సులో వివాహాలు చేయటం వల్ల బాలికల ఆరోగ్యాలు దెబ్బతింటాయని, తద్వారా వారు శారీరక మానసిక రుగ్మతలకు గురవుతారని ఆయన తెలిపారు. అందువల్ల 18 సంవత్సరాల లోపు వయసు ఉన్న బాలికలకు వివాహాలు జరిపించవద్దని అంటూ బాల్య వివాహాలు జరిపించడం ప్రోత్సహించడం, వారికి ఆశ్రయం కల్పించడం చట్టరీత్యా నేరమని అలాంటి వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. అందువల్ల బాల్య వివాహాల సమాచారాన్ని ముందస్తుగా తమకు తెలియజేసి బాల్యవివాహాల నిరోధానికి సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని వర్గాల ప్రజలు, రాజకీయ నాయకులు, పోటీ చేసే అభ్యర్థులు పోలీసులకు సహకరించాలని, ఎన్నికల సమయంలో నమోదయ్యే కేసులలో చిక్కుకునే వారి భవిష్యత్తు అంధకారమవుతుందని ఆయన హెచ్చరించారు. గ్రామాలలో కొత్త వ్యక్తుల సంచారాన్ని గమనిస్తూ వారి కదలికలపై నిఘా ఉంచుతూ, సమాచారాన్ని పోలీసులకు తెలియజేయాలని, సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచనలు సలహాలు ఇచ్చారు. బాలికలు, మహిళలపై వేధింపులు, మట్కా కోడి పందాలు తదితర జూదాలు, దొంగతనాలు తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ అలాంటి వాటికి పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మద్యం సేవించి వాహనాలు నడపవద్దని,ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని,మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని ఆయన ప్రజలకు సూచించారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే సంఘటనలను, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారి సమాచారాన్ని ముందస్తుగా గుర్తించి పోలీసులకు తెలియజేసి వాటిని అరికట్టేందుకు తమ వంతుగా సహకరించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు ఆ కార్యక్రమంలో కొమరోలు ఎస్సై కోట నాగేంద్రరావు ప్రజలకు శాంతి భద్రతల పరిరక్షణ, స్థానిక సంస్థల ఎన్నికలు, దొంగతనాలు, రోడ్డు ప్రమాదాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఆ కార్యక్రమంలో ఆ గ్రామ పెద్దలు ప్రజలు మహిళలు పాల్గొన్నారు.

# కూర్మావతారం అలంకారంలో షరాబ్ బజార్ శ్రీ వేంకటేశ్వరుడు



**గిద్దలూరు, పెన్ పవర్, అక్టోబరు 13**

దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మూడవ రోజు మంగళవారం గిద్దలూరు షరాబ్ వీధిలోని శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో మూలవిరాట్ స్వామివారు కూర్మావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు.మూల విరాట్ తో పాటు ఉత్సవ మూర్తులను కూడా ఉత్సవ ప్రత్యేకతకు అనుగుణంగా అలంకరించారు. వేదపండితులు తోటపల్లి చంద్రశేఖర శాస్త్రి స్వామివారికి కూర్మ రూప అలంకారాన్ని తీర్చిద్దిద్దడంలో తన ప్రతిభను కనపరిచారు. శ్రీదేవి, భూదేవి సమేత స్వామివారికి దేవస్థానంలో ఉభయ దాతల సౌజన్యంతో వివిధ సేవలు నిర్వహించారు. ప్రభాతవేళ సుప్రభాత సేవ, అభిషేక సేవ,పూలంగి సేవ అనంతరం వస్త్ర సమర్పణ చేశారు. స్వామి వారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. ప్రసాద పంపిణీ, ఉత్సవ నిర్వహణ ఏర్పాట్లను ఆలయ కమిటీ ప్రతినిధులు గంజి వీరయ్య, కంచర్ల శ్రీనివాసులు, రెడ్డిబోయిన పెద్దయ్య,దుద్యాల పుల్లయ్య తదితరులు పర్యవేక్షించారు.

# ఆనందంగా గడపండి.. జాగ్రత్తలు పాటించండి

ప్రకాశం జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు



**ఒంగోలు క్రైమ్, పెన్ పవర్ అక్టోబర్ 13**

దసరా సెలవులను విద్యార్థులు, యువత, వారి తల్లిదండ్రులు ఆనందంగా, సురక్షితంగా గడపాలని ప్రకాశం జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు, సూచించారు. సెలవుల సమయంలో సరదాగా గడిపే క్రమంలో అప్రమత్తంగా ఉండాలని, ఏమాత్రం నిర్లక్ష్యం వహించినా ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని హెచ్చరించారు. దసరా సెలవుల నేపథ్యంలో గ్రామాలు, పట్టణాల శివార్లలోని చెరువులు, బావులు, కాలువలు, ఇతర నీటి వనరుల వద్దకు పిల్లలు, యువకులు ఈత కోసం వెళ్లేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నీటి లోతుపై అవగాహన లేకుండా నీటిలోకి దిగడం ప్రాణాపాయానికి దారితీయవచ్చని హెచ్చరించారు. ఈత రాని వారు ఇతరుల ఒత్తిడికి లోనై నీటిలోకి దిగవద్దని స్పష్టం చేశారు.

విద్యార్థులు సెలవుల సమయంలో పర్యాటక ప్రాంతాలను సందర్శించేటప్పుడు తగిన జాగ్రత్తలు పాటించాలని, ప్రమాదకర ప్రాంతాలకు వెళ్లకుండా ఉండాలని జిల్లా ఎస్పీ గారు సూచించారు. పర్యాటక ప్రాంతాలను సందర్శించే సమయంలో పెద్దల పర్యవేక్షణలోనే వెళ్లాలని, అక్కడి భద్రతా నియమాలను తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలు ఎక్కడికి వెళ్తున్నారు, ఎవరితో వెళు న్నారు అనే విషయాలపై నిరంతరం దృష్టి సారించాలని సూచించారు. పిల్లల భద్రత విషయంలో తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని, చిన్నపాటి నిర్లక్ష్యం కూడా తీవ్ర ప్రమాదాలకు దారితీయవచ్చని తెలిపారు.

**మైనర్లకు వాహనాలు ఇస్తే చట్టపరమైన చర్యలు**

మైనర్లు (18 ఏళ్లలోపు వారు) సరదా కోసం ద్విచక్ర వాహనాలు లేదా ఇతర మోటారు వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశముందని ఎస్పీ హెచ్చరించారు. మైనర్లకు వాహనాలు ఇవ్వడం చట్టరీత్యా నేరమని స్పష్టం చేశారు. మైనర్లు వాహనాలు నడుపుతూ పట్టుబడితే సంబంధిత వాహన యజమానులు, తల్లిదండ్రులు పై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడంతో పాటు, జరిమానా.. జైలు శిక్ష పడే అవకాశం ఉందని తెలిపారు. పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని వారికి వాహనాలు ఇవ్వకుండా తల్లిదండ్రులు బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో ఉన్న చెరువులు, జలాశయాలు, కాలువలు, ఇతర నీటి ప్రవాహ ప్రాంతాల వద్ద ముందస్తు భద్రతా చర్యలు చేపట్టాలని పోలీసు అధికారులను జిల్లా ఎస్పీ ఆదేశించారు. విద్యార్థులు, యువత తమ విలువైన ప్రాణాలను క్షణిక సరదా కోసం ప్రమాదంలోకి నెట్టుకోవద్దని, తల్లిదండ్రులు, పోలీసుల సూచనలు పాటిస్తూ దసరా సెలవులను సురక్షితంగా, సంతోషంగా గడపాలని జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు కోరారు.

# కొమరోలు మండలంలోని 18 మంది రౌడీ షీటర్ల పై బైండోవర్ కేసులు

**రౌడీ షీట్లను స్టేషన్ పిలిపించి సత్ ప్రవర్తనతో మెలగాలని కౌన్సెలింగ్ ఇచ్చిన కొమరోలు ఎస్ఐ నాగేంద్రరావు.**

**స్థానిక సంస్థలు ఎన్నికలలో ఎలాంటి చట్ట వ్యతిరే కార్యకాలపాలకు పాల్పడిన కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరిక.**

**బైండోవర్ అయిన రౌడీ షీట్లను తాసిల్దార్ ఎదుట హాజరు పరిచిన పోలీసులు.**

**పెన్ పవర్ ప్రతినిధికి వివరాలు వెల్లడించిన ఎస్సై నాగేంద్రరావు**




**కొమరోలు పెన్ పవర్ అక్టోబర్ 13**

త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని మండలంలో శాంతిభద్రతలను పరిరక్షించేందుకు, తీసుకుంటున్న చర్యలలో భాగంగా ముందస్తు గా కొమరోలు మండలంలోని 18 మంది రౌడీ షీటర్ లపై బైండోవర్ కేసులు నమోదు చేశామని కొమరోలు ఎస్సై కోట నాగేందర్ రావు తెలిపారు. మంగళవారం ఎస్సై కొమరోలు పోలీస్ స్టేషన్లో పెన్ పవర్ ప్రతినిధితో మాట్లాడుతూ... త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికలు కొమరోలు మండలంలో అత్యంత ప్రశాంత వాతావరణంలో, సజవుగా నిర్వహించేందుకు ముందస్తుగా అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని ఆయన తెలిపారు.కొమరోలు మండలంలో 20 మంది రౌడీషీటర్లు ఉండగా వారిలో ఇద్దరు జైళ్ళలో జీవిత ఖైదు అనుభవిస్తూ ఉన్నారని ఆయన చెప్పారు.ఇక మిగిలిన 18 మందిని మంగళవారం పోలీస్ స్టేషన్కు పిలిపించి సత్ప్రవర్తనతో మెల్లగాలని వారికి కౌన్సిలింగ్ ఇచ్చామని ఆయన తెలిపారు.ఆ సందర్భంగా వారికి పలు సూచనలు సలహాలు ఇస్తూ రాబోయే స్థానిక సమస్య ఎన్నికలలో ఎలాంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడవద్దని, శాంతి భద్రతలకు విఘాతం కలిగించే విధంగా ప్రవర్తించవద్దని సూచించినట్లుగా తెలిపారు. రాజకీయ పార్టీల నేతల ప్రలోహాలకు గురై సమస్యలు కొని తెచ్చుకోవద్దని సలహాలు ఇచ్చినట్లుగా చెప్పారు. రౌడీ షీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలని, ముఖ్యంగా స్థానిక సంస్థలు ముగిసేంతవరకు అత్యంత జాగ్రత్తగా ఉండాలని వారికి హితువు పలికినట్లుగా చెప్పారు. స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరిగినా అందుకు రౌడీ షీట్లనే అనుమానించవలసి వస్తుందని ఆయన హెచ్చరించారు. కౌన్సిలింగ్ అనంతరం రౌడీ షీట్లను కొమరోలు తాసిల్దార్ భాగ్యలక్ష్మి ఎదుట హాజరు పరిచామని ఎస్సై తెలిపారు. మండలంలోని రాజకీయ పార్టీల నేతలు, కార్యకర్తలు ఎన్నికలలో పోటీ చేసే అభ్యర్థులు కొమరోలు మండలంలో స్థానిక సంస్థల ఎన్నికలు అత్యంత ప్రశాంత వాతావరణంలో సజావుగా జరిగేందుకు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అందుకు విరుద్ధంగా ప్రవర్తించే వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఇప్పటికే పలు పంచాయతీలలోని ఇరు వర్గాలపై బైండవర్ కేసులు నమోదు చేసి తాసిల్దార్ ఎదుట వారిని హాజరు పరిచామని ఆయన పేర్కొన్నారు. ఈ ప్రక్రియ కొనసాగుతూ ఉంటుందని తెలిపారు. త్వరలో జరగనున్న స్థానిక సమస్యలు ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ఇప్పటికే కొమరోలు మండలంలోని అన్ని గ్రామాలలో తాను పర్యటించానని,అంతేగాక షాడో టీం ను ఏర్పాటు చేసి గ్రామ గ్రామం నుంచి ఎప్పటికప్పుడు సమాచారాన్ని సేకరిస్తున్నట్లుగా ఆయన పేర్కొన్నారు. డ్రోన్ కెమెరాతో నిఘా మరింత పెంచామని, శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిని,చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిని గుర్తించి వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు గ్రామాలలో గల వివాదాస్పద వ్యక్తులను గుర్తించి వారిపై నిఘా ఏర్పాటు చేశామని అందువల్ల అలాంటివారు అత్యంత అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. ఇతర మండలాలు,ఇతర జిల్లాల నుంచి కొమరోలు మండలానికి వచ్చిన స్థానికేతరులు తక్షణమే వారి స్వస్థలాలకు వెళ్లిపోవాలని, అలాంటి వారిని గుర్తించి వారిని స్వస్థలాలు వెళ్లిపోవాల్సిందిగా మొదట సలహాలు ఇస్తామని,తమ సలహాలను పాటించని వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై నాగేంద్ర హెచ్చరించారు. తాము తమ సిబ్బందితో మండలంలోని గ్రామాలలో పల్లెనిద్ర కార్యక్రమాలు, విలేజ్ విసిట్ కార్యక్రమాలు చేపడుతూ ఆయా గ్రామాల్లోని ప్రజలకు, మహిళలకు,యువకులకు, పలు సూచనలు సలహాలు ఇస్తూ రోడ్డు ప్రమాదాలు, మహిళలు బాలికలపై వేధింపులు, దొంగతనాలు, చట్ట వ్యతిరేక కార్యకలాపాలు, జూదాలు తదితరు వాటిపై అవగాహన కల్పిస్తున్నామని,ఈ కార్యక్రమం కొనసాగుతుందని ఆయన తెలిపారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్లు ధరించాలని, త్రిబుల్ రైడింగ్ చేయరాదని, మైనర్లకు వాహనాలు ఇవ్వరాదని, మద్యం సేవించి వాహనాలు నడపవద్దని కోరారు. ఆటోవాలాలు రోడ్డు నిబంధనలు పాటిస్తూ, పరిమిత ప్రయాణికులతో, పరిమిత వేగంతో వాహనం నడుపుతూ ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాలని ఆయన సూచించారు.

# చీమకుర్తి శ్రీ హరిహర క్షేత్రంలో ఘనంగా శ్రీ దేవి శరన్నవరాత్రుల ఉత్సవాలు

**- అన్నపూర్ణ దేవి అలంకరణతో భక్తులకు దర్శన భాగ్యం కలిగించిన వాసవి అమ్మవారు**

**- వాసవి అమ్మవారికి ధాన్యాభిషేకం నిర్వహించిన లక్ష్మి పద్మావతి**





**ఒంగోలు కల్చరల్, పెన్ పవర్ అక్టోబర్ 13**



చీమకుర్తి శ్రీ హరిహర క్షేత్రంలో శ్రీ దేవి శరన్నవరాత్రుల ఉత్సవాలలో భాగంగా మూడవ రోజు మంగళవారం శ్రీ పార్వతీ దేవి అమ్మవారు శ్రీ అన్నపూర్ణ దేవి అలంకరణతో భక్తులకు దర్శనం ఇచ్చారు. మాజీమంత్రి శిద్దా రాఘవ రావు.. శిద్దా లక్ష్మి పద్మావతి దంపతులు,శిద్దా పాండురంగరావు దంపతులు ఆద్వర్యంలో ఉదయం శ్రీ వాసవి అమ్మవారికి పాంచామృత సుగంధ ద్రవ్యాల అభిషేకాలు నిర్వహించి తదుపరి అమ్మవారికి శ్రీ చక్రార్చన సాయంత్రం ఉభయదాతల చే కుంకుమ అర్చన, నవావరణ పూజ, అమ్మవారికి వారికి పంచామృత అభిషేకాలు అర్యవైశ్య మహిళలచే సామూహిక శ్రీ లలితా సహస్ర నామ సోస్త్రం, పారాయణం,నైవేద్యం,హారతి,తీర్థప్రసాదాల వినియోగం నిర్వహించారు. శ్రీ దేవి శరన్నవరాత్రి సందర్భంగా శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారికి ఆలయ ధర్మ కర్తలు శిద్దా రాఘవ రావు లక్ష్మి పద్మావతి దంపతులు, శిద్దా పాండురంగరావు దంపతులు,కుటుంబ సభ్యులు ఆద్వర్యంలో వాసవి మహిళా భక్తులతో కలసి అమ్మవారికి ధాన్యాభిషేకం అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తులు స్వయంగా తీసుకువచ్చిన ధాన్యంతో అమ్మవారికి అభిషేకాలు నిర్వహించడం విశేషంగా జరిగింది.బుధవారం అమ్మవారు శ్రీ కాత్యాయనీ దేవి అలంకారం తో భక్తులకు దర్శన భాగ్యం తో పాటుగా అమ్మవారికి కుంకుమ పూజలు, సౌందర్యం లహరి,మణి ద్వీప వర్ణన పారాయణం జరుగునని లక్ష్మి పద్మావతి తెలిపారు. శిద్దా వెంకటేశ్వర్లు, వెంకట సుబ్బమ్మ ట్రస్ట్ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు అల్పాహారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో శిద్దా పాండురంగారావు దంపతులు,శిద్దా సుధాకర్ దంపతులు, కొణిజేటి సువర్ణ,గాదంశెట్టి లక్ష్మి, చలువాది మాధవి, కూరపాటి ధనలక్ష్మి,దా సువర్చల, ఏ.అరుణ, చీమకుర్తి కి చెందిన మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# శక్తి ఆరాధనకు ప్రతీక శరన్నవరాత్రులు



**సి ఎస్ పురం, పెన్ పవర్ అక్టోబర్ 13**

దసరా పండుగ హిందూ సంప్రదాయంలో అత్యంత విశిష్టమైన పర్వదినం. చెడుపై మంచి సాధించిన విజయానికి, అధర్మంపై ధర్మం గెలిచిన దానికి ప్రతీకగా విజయదశమిని జరుపుకుంటారు. దసరా సందర్భంగా నిర్వహించే శరన్నవరాత్రులు ఆధ్యాత్మిక చింతనకు, భక్తిభావానికి, దైవారాధనకు ప్రత్యేక ప్రాధాన్యతను కలిగి ఉంటాయి. శరన్నవరాత్రుల్లో తొమ్మిది రోజులపాటు దుర్గాదేవిని వివిధ రూపాల్లో అలంకరణ చేసి ఆరాధిస్తారు. ఒక్కో రూపం ఒక్కో ఆధ్యాత్మిక సందేశాన్ని అందిస్తూ భక్తుల్లో ధైర్యం, భక్తి, సహనం, జ్ఞానం, శక్తి వంటి సద్గుణాలను పెంపొందిస్తుందని విశ్వసిస్తారు.దుర్గాదేవి మహిషాసురుడనే రాక్షసుడిని సంహరించి లోకాలకు శాంతిని ప్రసాదించినట్లు పురాణాలు వివరిస్తాయి. ఈ నేపథ్యంలో శరన్నవరాత్రులు దుష్టశక్తులపై దైవశక్తి సాధించిన విజయానికి సంకేతంగా నిలుస్తాయి. తొమ్మిది రోజులపాటు అమ్మవారిని భక్తిశ్రద్ధలతో పూజించి, పదో రోజు విజయదశమిని ఘనంగా జరుపుకుంటారు.ఈ పర్వదినాల్లో ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అలంకరణలు, కుంకుమార్చనలు, చండీ పారాయణాలు, హోమాలు నిర్వహిస్తారు. భక్తులు ఉపవాస దీక్షలు చేపట్టి అమ్మవారి అనుగ్రహం కోసం ప్రార్థిస్తారు శరన్నవరాత్రులలో అమ్మవారి శక్తిని ఆరాధించడం ద్వారా జీవితంలోని కష్టాలను ధైర్యంగా ఎదుర్కొనే ఆత్మవిశ్వాసం కలుగుతుందని భక్తులు విశ్వసిస్తారు విజయదశమి రోజున కొత్త పనులు చేపట్టడం విద్యాభ్యాసానికి శ్రీకారం చుట్టడం ఆయుధ పూజ శమీ పూజ నిర్వహించడం అనేక ప్రాంతాలలో ఆనవాయితీగా కొనసాగుతుంది చెడుపై మంచి, అజ్ఞానం పై జ్ఞానం, ఆధర్మంపై ధర్మం విజయం సాధిస్తాయని విశ్వసిస్తూ అనేక దేవాలయాలలో శరన్నవరాత్రి వేడుకలు ఘనంగా జరుపుకుంటారు.

# ఘనంగా విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆవిర్భావ దినోత్సవం





**గిద్దలూరు పెన్ పవర్ అక్టోబర్ 13**

గిద్దలూరు యూనిట్ విశ్రాంత ఉద్యోగుల సంఘం 42 వ ఆవిర్భావ దినోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా , సంఘ అధ్యక్షులు జి రవీంద్ర నాథ రెడ్డి ఆధ్వర్యంలో40 మంది సీనియర్ సిటిజన్ విశ్రాంత ఉద్యోగుల ను ఘనంగా సన్మానం చేసి సత్కరించారు. విశ్రాంత ఉద్యోగుల పెద్ద ఎత్తున హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. కార్యక్రమంలో ఎమ్ భాస్కర్ రెడ్డి , పాలగుళ్ల శివారెడ్డి ఎస్ కొండయ్య , తదితరులు పాల్గొన్నారు.

# గుండెపోటుతో వీఆర్ఐ విక్టర్ మృతి!

**గిద్దలూరు పెన్ పవర్ అక్టోబర్ 14**

గిద్దలూరులో వీఆర్ఏ గా విధులు నిర్వహిస్తున్న విక్టర్ గుండెపోటుతో మృతి చెందారు. మంగళవారం తెల్లవారుజామున ఒంటిగంట సమయంలో గిద్దలూరులో ఆయన నివాసం లో తుదిశ్వాస విడిచారు. మృతునికి భార్య, ముగ్గురు సంతానం ఉన్నారు. విక్టర్ ఆకస్మిక మరణంతో స్థానికంగా విషాదం నెలకొంది.



# జీవీఎంసీ మేయర్ రేసులో కొత్త ట్విస్ట్..

- తెరపైకి జీవీ రామచంద్రరావు సతీమణి సంధ్యారాణి!
- జనరల్ మహిళా రిజర్వేషన్‌తో మారిన లెక్కలు..
- సంధ్యారాణి పేరును పరిశీలించాలంటూ వైసీపీ అధిష్ఠానం నుంచి కబురు?



విశాఖ మహానగర రాజకీయాల్లో మేయర్ పీఠం చుట్టూ కొత్త సమీకరణాలు మొదలయ్యాయి. జనరల్ మహిళా రిజర్వేషన్‌తో రాజకీయ పార్టీల వ్యూహాలు మారుతున్న వేళ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి సీనియర్ రాజకీయ నాయకుడు జీవీ రామచంద్రరావు సతీమణి సంధ్యారాణి పేరు అనూహ్యంగా తెరపైకి వచ్చింది. ఉన్నత విద్యార్హతలు, ఎనిమిది భాషల్లో ప్రావీణ్యం, సామాజిక సేవా నేపథ్యం, కుటుంబానికి ఉన్న రాజకీయ పరిచయాలు ఆమెకు అనుకూల అంశాలుగా చర్చకు వస్తున్నాయి.సంధ్యారాణి అభ్యర్థిత్వాన్ని పరిశీలించాలంటూ వైసీపీ అధిష్ఠానం నుంచి విశాఖలోని ముఖ్య నాయకులకు సంకేతాలు అందినట్లు రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ముఖ్యంగా జీవీ రామచంద్రరావుకు మత్స్యకార సామాజిక వర్గంలో ఉన్న పరిచయాలు, ఇతర సామాజిక వర్గాలతో సంబంధాలు, సుదీర్ఘ రాజకీయ అనుభవం ఈ చర్చకు మరింత ప్రాధాన్యం తీసుకొచ్చాయి. అయితే అధిష్ఠానం నిర్ణయం ఎలా ఉండబోతోంది? సంధ్యారాణి అభ్యర్థిత్వానికి స్థానిక నాయకత్వం నుంచి ఎలాంటి స్పందన వస్తుంది? అన్నది ఇప్పుడు విశాఖ రాజకీయాల్లో ఆసక్తికరంగా మారింది.

విశాఖపట్నం, పెన్ పవర్ ప్రత్యేక కథనం అక్టోబర్ 13 :

మహా విశాఖ నగర పాలక సంస్థ (జీవీఎంసీ) మేయర్ పదవి చుట్టూ రాజకీయ వేడి క్రమంగా పెరుగుతోంది. మేయర్ స్థానాన్ని జనరల్ మహిళా కేటగిరీకి కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం రిజర్వేషన్ ఉత్తర్వులు జారీ చేసిన నేపథ్యంలో ప్రధాన రాజకీయ పార్టీల్లో కొత్త పేర్లు తెరపైకి వస్తున్నాయి. ఇప్పటివరకు రాజకీయ వర్గాల్లో వినిపించిన సమీకరణాలకు భిన్నంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో మరో ఆసక్తికరమైన పేరు చర్చకు రావడం విశాఖ రాజకీయాల్లో ప్రాధాన్యం సంతరించుకుంది. ఆ పేరే సీనియర్ రాజకీయ నాయకుడు జీవీ రామచంద్రరావు సతీమణి సంధ్యారాణి. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో అభ్యర్థిత్వంపై జరుగుతున్న అంతర్గత చర్చల్లో సంధ్యారాణి పేరును కూడా పరిగణనలోకి తీసుకోవాలని పార్టీ అధిష్ఠానం నుంచి స్థానిక ముఖ్య నాయకులకు సమాచారం అందినట్లు రాజకీయ వర్గాల్లో ప్రచారం సాగుతోంది. ఈ సమాచారంపై అధికారిక ధ్రువీకరణ లేనప్పటికీ, ఆమె పేరు రాజకీయ చర్చల్లోకి రావడం వెనుక పలు అంశాలు ఉన్నాయని పార్టీ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. విద్యార్హతలు, సామాజిక సేవలో భాగస్వామ్యం, కుటుంబ రాజకీయ నేపథ్యం, నగరంలోని వివిధ వర్గాలతో ఉన్న పరిచయాలు ఆమెకు అనుకూలంగా మారవచ్చని భావిస్తున్నారు. అయితే రాజకీయంగా కీలకమైన జీవీఎంసీ మేయర్ పదవికి అభ్యర్థిని ఎంపిక చేసే విషయంలో పార్టీ అధిష్ఠానం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందన్నది ఆసక్తికరంగా మారింది.

### 1. జనరల్ మహిళా రిజర్వేషన్.. మారుతున్న విశాఖ రాజకీయ సమీకరణాలు!

జీవీఎంసీ మేయర్ పదవికి జనరల్ మహిళా రిజర్వేషన్ ఖరారు కావడంతో విశాఖ నగర రాజకీయాల్లో కొత్త లెక్కలు మొదలయ్యాయి. ఇప్పటివరకు రాజకీయ పార్టీల్లో కొనసాగిన అభ్యర్థిత్వ అంచనాలు మారుతున్నాయి. మహిళా నాయకత్వానికి ప్రాధాన్యం ఇవ్వాల్సిన పరిస్థితుల్లో రాజకీయ అనుభవం ఉన్న కుటుంబాల నుంచి కూడా కొత్త పేర్లు వినిపిస్తున్నాయి. జనరల్ మహిళా రిజర్వేషన్ అంటే కేవలం ఒక సామాజిక వర్గానికి మాత్రమే పరిమితమైన అవకాశం కాదు. నిబంధనల ప్రకారం అర్హత కలిగిన వివిధ సామాజిక వర్గాలకు చెందిన మహిళలు ఈ స్థానానికి పోటీ పడే అవకాశం ఉంటుంది. ఈ నేపథ్యంలో రాజకీయ పార్టీలు అభ్యర్థుల ఎంపికలో సామాజిక సమీకరణాలు, స్థానిక పరిచయాలు, పార్టీ పట్ల విధేయత, ప్రజల్లో గుర్తింపు, నాయకత్వ సామర్థ్యం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకునే అవకాశముంది. విశాఖ వంటి మహానగరంలో మేయర్ పదవి కేవలం రాజకీయ హోదా మాత్రమే కాదు. నగర అభివృద్ధికి సంబంధించిన కీలక నిర్ణయాల్లో భాగస్వామ్యం వహించాల్సిన బాధ్యతాయుతమైన స్థానం. అందువల్ల అభ్యర్థి ఎంపికలో రాజకీయ సమీకరణాలతోపాటు పరిపాలనా అవగాహన, ప్రజా సమస్యలపై స్పందించే సామర్థ్యం కూడా ప్రధానంగా మారనున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో సంధ్యారాణి పేరు తెరపైకి రావడం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అంతర్గత రాజకీయాల్లో ఆసక్తికర పరిణామంగా కనిపిస్తోంది.

### 2. అధిష్ఠానం నుంచి సంకేతాలు?.. సంధ్యారాణి పేరుపై వైసీపీలో చర్చ!

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో జీవీఎంసీ మేయర్ అభ్యర్థిత్వానికి సంబంధించి జరుగుతున్న చర్చల్లో సంధ్యారాణి పేరు ప్రాధాన్యం సంతరించుకున్నట్లు రాజకీయ వర్గాల సమాచారం. ఆమె పేరును పరిశీలించాలని పార్టీ అధిష్ఠానం నుంచి విశాఖలోని కొందరు ముఖ్య నాయకులకు సంకేతాలు అందినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ ప్రచారానికి సంబంధించి అధికారిక ప్రకటన వెలువడనప్పటికీ, సంధ్యారాణి విద్యార్హతలు, సామాజిక సేవా నేపథ్యం, జీవీ రామచంద్రరావుకు ఉన్న రాజకీయ అనుభవం వంటి అంశాలు ఆమె పేరును చర్చలోకి తీసుకువచ్చినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా విశాఖ నగరంలోని వివిధ సామాజిక వర్గాలు, కళా సాంస్కృతిక సంస్థలు, సేవా సంఘాలతో జీవీ రామచంద్రరావు కుటుంబానికి ఉన్న పరిచయాలు రాజకీయంగా ఉపయోగపడవచ్చని ఆయన అనుచరులు అభిప్రాయపడుతున్నారు. అయితే అభ్యర్థిత్వానికి సంబంధించి అధిష్ఠానం నుంచి అధికారిక నిర్ణయం వెలువడే వరకు ఈ పరిణామాలను రాజకీయ వర్గాల్లో జరుగుతున్న చర్చలుగానే పరిగణించాల్సి ఉంటుంది. సంధ్యారాణి పేరును పరిశీలనలోకి తీసుకోవడం ఒక అంశమైతే, ఆమె అభ్యర్థిత్వాన్ని ఖరారు చేయడం మరో అంశం. ఈ రెండింటి మధ్య పార్టీ అంతర్గత సంప్రదింపులు, స్థానిక నాయకుల అభిప్రాయాలు, ఎన్నికల వ్యూహాలు కీలక పాత్ర పోషించనున్నాయి.

### 9. విశాఖ అభివృద్ధే అసలు సవాల్.. మేయర్ పీఠం అధిష్ఠించే వారికి బాధ్యతలెన్నో!

**విశాఖపట్నం ఆంధ్రప్రదేశ్‌లో అత్యంత ప్రాధాన్యం కలిగిన మహానగరాల్లో ఒకటి.పారిశ్రామిక, వాణిజ్య, విద్యా, పర్యాటక రంగాలతోపాటు సముద్రతీర నగరంగా విశాఖకు ప్రత్యేక గుర్తింపు ఉంది. వేగంగా విస్తరిస్తున్న నగరంలో మౌలిక సదుపాయాల అభివృద్ధి, ప్రజలకు అవసరమైన సేవల కల్పన స్థానిక పాలనా వ్యవస్థ ముందున్న ప్రధాన సవాళ్లు. ముఖ్యంగా రహదారుల అభివృద్ధి, పారిశుద్ధ్య నిర్వహణ, తాగునీటి సరఫరా, డ్రైనేజీ వ్యవస్థ, వర్షపు నీటి ముంపు సమస్యలు, ప్రజారోగ్యం, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి అవసరం. నగరంలోని పేద, మధ్యతరగతి కుటుంబాల సమస్యలను గుర్తించడం, మురికివాడల్లో మౌలిక వసతులు మెరుగుపరచడం, మహిళల భద్రతకు అనుకూలమైన పట్టణ వాతావరణం కల్పించడం కూడా కీలక అంశాలే. ముఖ్యంగా తీరప్రాంత ప్రజల జీవనోపాధి, మత్స్యకార కుటుంబాల సమస్యలు, పర్యావరణ పరిరక్షణ, పారిశ్రామిక కాలుష్య నియంత్రణ వంటి అంశాలు విశాఖ నగర పాలనలో ప్రత్యేక ప్రాధాన్యం కలిగి ఉన్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో మేయర్ పదవిని చేపట్టే వ్యక్తికి రాజకీయ పరిచయాలతోపాటు నగర అభివృద్ధిపై స్పష్టమైన దృక్పథం అవసరం. పాలనా యంత్రాంగంతో సమన్వయం చేసుకోవడం, ప్రజాప్రతినిధుల అభిప్రాయాలను గౌరవించడం, నగర ప్రజల అవసరాలకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకోవడం కీలకం. ఈ నేపథ్యంలో సంధ్యారాణి పేరు మేయర్ అభ్యర్థిత్వ చర్చల్లో వినిపిస్తున్నప్పటికీ, నగర అభివృద్ధిపై ఆమె దృక్పథం ఏమిటన్న అంశం కూడా రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకునే అవకాశముంది. ఆమె విద్యార్హతలు, సామాజిక సేవా నేపథ్యం గురించి సన్నిహితులు ప్రస్తావిస్తున్నప్పటికీ, ప్రజాప్రతినిధిగా బాధ్యతలు చేపట్టే అవకాశం వస్తే విశాఖ అభివృద్ధికి ఎలాంటి ప్రాధాన్యాలు నిర్దేశించుకుంటారన్నది తెలుసుకోవాల్సి ఉంది.**

### 3. ఉన్నత విద్యావంతురాలు సంధ్యారాణి.. ఎనిమిది భాషల్లో ప్రావీణ్యం!

సంధ్యారాణి పేరు రాజకీయంగా చర్చకు రావడంతో ఆమె వ్యక్తిగత, విద్యా నేపథ్యం కూడా ప్రాధాన్యం సంతరించుకుంది. కుటుంబ వర్గాలు వెల్లడిస్తున్న వివరాల ప్రకారం సంధ్యారాణి ఉన్నత విద్యావంతురాలు. చార్టర్డ్ అకౌంటెన్సీ (సీఏ) అభ్యసించిన ఆమెకు ఆర్థిక అంశాలపై అవగాహన ఉందని సన్నిహితులు పేర్కొంటున్నారు. అంతేకాకుండా ఎనిమిది భాషలను అనర్గళంగా మాట్లాడగల సామర్థ్యం ఆమెకు ఉందని చెబుతున్నారు. వివిధ భాషలు మాట్లాడగలగడం విశాఖ వంటి విభిన్న సంస్కృతుల సమ్మేళనంగా ఉన్న మహానగరంలో ప్రజలతో సంబంధాలు ఏర్పరచుకునేందుకు ఉపయోగపడే లక్షణంగా భావించవచ్చు. ముఖ్యంగా విశాఖపట్నం పారిశ్రామిక, వాణిజ్య, విద్యా, పర్యాటక రంగాలకు కేంద్రంగా అభివృద్ధి చెందుతోంది. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు ఇక్కడ నివసిస్తున్నారు. ఇలాంటి నగరంలో విభిన్న వర్గాలతో సమన్వయం చేసుకోవడం ప్రజాప్రతినిధులకు అవసరమైన లక్షణం. అయితే విద్యార్హతలు, భాషా ప్రావీణ్యం మాత్రమే రాజకీయ విజయాన్ని నిర్ణయించలేవు. ప్రజా సమస్యలపై అవగాహన, నిర్ణయాలు తీసుకునే సామర్థ్యం, ప్రజలతో ప్రత్యక్ష సంబంధాలు కూడా అంతే ముఖ్యమైనవి. ఈ నేపథ్యంలో సంధ్యారాణి విద్యా నేపథ్యం ఆమె అభ్యర్థిత్వ చర్చల్లో ఒక సానుకూల అంశంగా ప్రస్తావనకు వస్తోంది.

### 4. చిన్ననాటి నుంచే సేవా దృక్పథం.. భర్తకు అండగా సామాజిక కార్యక్రమాలు!

సంధ్యారాణి వ్యక్తిత్వంలో సామాజిక సేవకు ప్రత్యేక స్థానం ఉందని కుటుంబానికి సన్నిహితంగా ఉన్నవారు చెబుతున్నారు. చిన్ననాటి నుంచే అవసరంలో ఉన్నవారికి సహాయం చేయాలనే ఆలోచనతో పెరిగిన ఆమె, వివాహానంతరం కూడా అదే సేవా దృక్పథాన్ని కొనసాగించారని పేర్కొంటున్నారు. జీవీ రామచంద్రరావు చేపట్టే వివిధ సామాజిక సేవా కార్యక్రమాలకు సంధ్యారాణి ప్రోత్సాహం అందిస్తూ వచ్చారని ఆయన సన్నిహితులు వివరిస్తున్నారు. పేద కుటుంబాలకు చేయూత అందించడం, విద్యార్థుల చదువుకు సహకరించడం, కళాకారులను ప్రోత్సహించడం, క్రీడా కార్యక్రమాలకు అండగా నిలవడం వంటి కార్యక్రమాల్లో ఆమె కుటుంబం భాగస్వామ్యమైందని చెబుతున్నారు. సాధారణంగా రాజకీయాల్లో ప్రజాప్రతినిధుల కుటుంబ సభ్యులు సామాజిక కార్యక్రమాలకు సహకరిస్తుంటారు. అయితే అలాంటి కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా సమాజంలోని వివిధ వర్గాల సమస్యలను దగ్గరగా తెలుసుకునే అవకాశం ఏర్పడుతుంది. సంధ్యారాణి విషయంలోనూ ఈ సేవా నేపథ్యాన్ని ఆమెకు అనుకూల అంశంగా సన్నిహిత వర్గాలు ప్రస్తావిస్తున్నాయి. ఇప్పటివరకు ప్రత్యక్ష రాజకీయాల్లో ఆమె పాత్ర ఎంతవరకు ఉందన్న అంశం కన్నా, సామాజిక సేవలో ఆమె భాగస్వామ్యం ప్రస్తుతం ఎక్కువగా చర్చకు వస్తోంది.

### 6. కళాకారులకు అండ.. క్రీడాకారులకు ప్రోత్సాహం.. పేదలకు చేయూత!

జీవీ రామచంద్రరావు రాజకీయ కార్యకలాపాలతోపాటు సామాజిక సేవా కార్యక్రమాల్లోనూ భాగస్వామ్యం కొనసాగిస్తున్నారని ఆయన సన్నిహితులు చెబుతున్నారు. ముఖ్యంగా కళలు, క్రీడలు, విద్య, సాంస్కృతిక రంగాలకు ఆయన ప్రాధాన్యం ఇస్తారని పేర్కొంటున్నారు. ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కళాకారులకు సహాయం అందించడం, అనారోగ్యంతో బాధపడుతున్న కళాకారుల వైద్య అవసరాలకు సహకరించడం వంటి కార్యక్రమాల్లో పాల్గొన్నట్లు వివరిస్తున్నారు. అలాగే క్రీడా రంగంలో ప్రతిభ కనబరుస్తున్న యువతకు ప్రోత్సాహం అందించడం, క్రీడా పోటీల నిర్వహణకు సహకరించడం వంటి కార్యక్రమాలను చేపట్టినట్లు ఆయన వర్గాలు వెల్లడిస్తున్నాయి. పేద విద్యార్థుల చదువుకు ఆర్థిక సహాయం అందించడం, విద్యా ఫీజుల చెల్లింపునకు చేయూతనివ్వడం వంటి కార్యక్రమాల్లోనూ ఆయన భాగస్వామ్యం ఉందని చెబుతున్నారు. జీవనోపాధి కోసం ఇబ్బందులు ఎదుర్కొంటున్న మహిళలకు కుట్టు మిషన్లు అందించడం, చిన్న వ్యాపారాలు ప్రారంభించేందుకు సహకరించడం వంటి కార్యక్రమాలను కూడా ఆయన కుటుంబం చేపట్టినట్లు సమాచారం. అన్నదాన కార్యక్రమాలు, దేవాలయాలకు విరాళాలు, వివిధ సంఘాల సాంస్కృతిక కార్యక్రమాలకు సహకారం వంటి సేవా కార్యక్రమాల ద్వారా స్థానికంగా పరిచయాలు పెరిగాయని అనుచరులు పేర్కొంటున్నారు. ఈ కార్యక్రమాల్లో సంధ్యారాణి కూడా భాగస్వామ్యమవుతూ భర్తకు ప్రోత్సాహం అందించారని చెబుతున్నారు. దీంతో రాజకీయ నేపథ్యంతోపాటు సామాజిక సేవా కార్యక్రమాల్లో కుటుంబానికి ఉన్న అనుబంధం కూడా సంధ్యారాణి అభ్యర్థిత్వ చర్చల్లో ప్రస్తావనకు వస్తోంది.

### 7. మత్స్యకార వర్గంతో అనుబంధం.. సామాజిక సమీకరణాల్లో కొత్త కోణం!

విశాఖ రాజకీయాల్లో సామాజిక సమీకరణాలకు ప్రత్యేక ప్రాధాన్యం ఉంది. ముఖ్యంగా తీరప్రాంత నగరంగా గుర్తింపు పొందిన విశాఖపట్నంలో మత్స్యకార వర్గానికి సామాజిక, ఆర్థిక, రాజకీయ ప్రాధాన్యం ఉంది. ఈ నేపథ్యంలో జీవీ రామచంద్రరావు మత్స్యకార సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి కావడం ఆయన కుటుంబ రాజకీయ నేపథ్యంపై జరుగుతున్న చర్చల్లో ఒక అంశంగా మారింది. కుటుంబ వర్గాల సమాచారం ప్రకారం సంధ్యారాణి బ్రాహ్మణ సామాజిక వర్గానికి చెందినవారు. జీవీ రామచంద్రరావు మత్స్యకార సామాజిక వర్గానికి చెందినవారు కాగా, ఆయన మాతృమూర్తి కమ్మ సామాజిక వర్గానికి చెందినవారని చెబుతున్నారు. ఈ కుటుంబ నేపథ్యం కారణంగా వివిధ సామాజిక వర్గాలతో పరిచయాలు ఏర్పడ్డాయని ఆయన సన్నిహితులు పేర్కొంటున్నారు. అయితే సామాజిక వర్గాల పరిచయాలు రాజకీయంగా ఎంతవరకు ప్రభావం చూపుతాయన్నది ప్రత్యేకంగా పరిశీలించాల్సిన అంశం. ఏ అభ్యర్థికైనా కేవలం సామాజిక నేపథ్యం మాత్రమే విజయాన్ని అందించదు. పార్టీ సంస్థాగత బలం, స్థానిక నాయకత్వ మద్దతు, ప్రజల విశ్వాసం, ఎన్నికల సమయంలో నెలకొనే రాజకీయ పరిస్థితులు కూడా కీలకమే. అయినప్పటికీ విశాఖ నగరంలోని విభిన్న సామాజిక వర్గాలతో జీవీ రామచంద్రరావు కుటుంబానికి ఉన్న పరిచయాలు సంధ్యారాణి పేరును పరిశీలించడంలో ఒక అంశంగా మారవచ్చని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు.

### 8. స్థానిక నాయకత్వం మద్దతు కీలకం.. అభ్యర్థిత్వంపై తుది నిర్ణయం ఎవరిది?

సంధ్యారాణి పేరు మేయర్ అభ్యర్థిత్వ చర్చల్లోకి వచ్చినప్పటికీ ఆమె రాజకీయ ప్రయాణంలో తదుపరి పరిణామాలు ఎలా ఉంటాయన్నది ఇంకా స్పష్టత రావాల్సిన అంశం. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం నుంచి ఆమె పేరును పరిశీలించాలన్న సంకేతాలు అందినట్లు ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో స్థానిక నాయకత్వం స్పందనకు ప్రాధాన్యం ఏర్పడింది. విశాఖ వంటి పెద్ద నగరంలో రాజకీయ అభ్యర్థిని ఎంపిక చేయడం సాధారణ విషయం కాదు. పార్టీకి చెందిన సీనియర్ నాయకులు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, నియోజకవర్గ స్థాయి నాయకత్వం, సంస్థాగత బాధ్యతలు నిర్వహిస్తున్న వ్యక్తుల అభిప్రాయాలు అభ్యర్థి ఎంపికలో ప్రభావం చూపే అవకాశముంది. అదే సమయంలో అభ్యర్థి ప్రజల్లో ఎంతవరకు గుర్తింపు పొందారు? పార్టీ కార్యక్రమాల్లో ఎంత చురుగ్గా పాల్గొన్నారు? నగర సమస్యలపై ఎంత అవగాహన ఉంది? అనే ప్రశ్నలు కూడా ముందుకు వస్తాయి. సంధ్యారాణి విషయంలో ఆమె విద్యార్హతలు, సేవా నేపథ్యం సానుకూల అంశాలుగా వినిపిస్తున్నప్పటికీ ప్రత్యక్ష రాజకీయ అనుభవం, పార్టీ కార్యకర్తలతో అనుబంధం, నాయకత్వ సామర్థ్యం వంటి అంశాలపై కూడా చర్చ జరిగే అవకాశముంది. అంతేకాకుండా మేయర్ పదవికి సంబంధించిన ఎన్నికల విధానం, అభ్యర్థి అర్హతలు, కార్పొరేటర్ స్థానాలకు సంబంధించిన ఎన్నికల ప్రక్రియ కూడా కీలకం. ఈ నేపథ్యంలో సంధ్యారాణి పేరు రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకున్నప్పటికీ అధికారిక అభ్యర్థిత్వం ఖరారైందని చెప్పడానికి ఇంకా అవకాశం లేదు.

### 5. కాంగ్రెస్ నుంచి టీడీపీ మీదుగా వైసీపీలోకి.. జీవీ రామచంద్రరావు రాజకీయ ప్రస్థానం!

సంధ్యారాణి పేరు మేయర్ రేసులో వినిపించడం వెనుక జీవీ రామచంద్రరావు రాజకీయ నేపథ్యం కూడా ప్రధాన అంశంగా కనిపిస్తోంది. సుదీర్ఘకాలంగా విశాఖ రాజకీయ, సామాజిక రంగాలతో అనుబంధం కొనసాగిస్తున్న జీవీ రామచంద్రరావు తన రాజకీయ ప్రస్థానాన్ని కాంగ్రెస్ పార్టీతో ప్రారంభించారు. అనంతరం తెలుగుదేశం పార్టీలో కొనసాగిన ఆయన ప్రస్తుతం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో ఉన్నారు. వివిధ రాజకీయ పార్టీల్లో పనిచేసిన అనుభవంతోపాటు పలు నామినేటెడ్ పదవుల్లో బాధ్యతలు నిర్వహించినట్లు ఆయన వర్గాలు పేర్కొంటున్నాయి. ముఖ్యంగా సుమారు పదేళ్లపాటు ఫిలిం సెన్సార్ బోర్డు సభ్యుడిగా పనిచేసిన అనుభవం ఆయనకు ఉందని చెబుతున్నారు. అలాగే రైల్వే, పోర్టు ట్రస్ట్‌కు సంబంధించిన బోర్డుల్లోనూ బాధ్యతలు నిర్వహించినట్లు ఆయన సన్నిహితులు వెల్లడిస్తున్నారు. ఈ బాధ్యతల ద్వారా రాజకీయ నాయకులతోపాటు పరిపాలనా వ్యవస్థలోని వివిధ స్థాయిల వ్యక్తులతో పరిచయాలు ఏర్పడినట్లు తెలుస్తోంది. విశాఖ నగరంలో రాజకీయంగా వివిధ దశలను చూసిన నాయకుడిగా జీవీ రామచంద్రరావుకు అనుభవం ఉందని ఆయన అనుచరులు అభిప్రాయపడుతున్నారు. అయితే గతంలో వివిధ పార్టీల్లో పనిచేసిన రాజకీయ అనుభవం ప్రస్తుత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సంస్థాగత వ్యూహంలో ఎంతవరకు ఉపయోగపడుతుందన్నది పరిశీలించాల్సిన అంశం.

### 10. మేయర్ రేసులో సంధ్యారాణి పేరు.. వైసీపీ వ్యూహంలో కొత్త అధ్యాయమా?

జీవీఎంసీ మేయర్ పదవికి జనరల్ మహిళా రిజర్వేషన్ ఖరారైన నేపథ్యంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాజకీయ వ్యూహం ఎలా ఉండబోతోందన్న అంశంపై ఆసక్తి పెరుగుతోంది. ఈ క్రమంలో జీవీ రామచంద్రరావు సతీమణి సంధ్యారాణి పేరు తెరపైకి రావడం విశాఖ రాజకీయాల్లో కొత్త చర్చకు దారితీసింది. సుదీర్ఘ రాజకీయ అనుభవం కలిగిన జీవీ రామచంద్రరావుకు ఉన్న పరిచయాలు, మత్స్యకార సామాజిక వర్గంతో ఆయన అనుబంధం, వివిధ సామాజిక వర్గాలతో కుటుంబానికి ఉన్న సంబంధాలు, సంధ్యారాణి విద్యార్హతలు, సామాజిక సేవలో భాగస్వామ్యం వంటి అంశాలు ఆమెకు అనుకూలంగా ఉన్నాయని సన్నిహిత వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. ముఖ్యంగా ఎనిమిది భాషల్లో ప్రావీణ్యం, చార్టర్డ్ అకౌంటెన్సీ విద్యా నేపథ్యం, సేవా కార్యక్రమాల్లో భాగస్వామ్యం వంటి అంశాలు ఆమెను ఇతర ఆశావహులతో పోల్చినప్పుడు ప్రత్యేకంగా నిలబెట్టవచ్చని వారు భావిస్తున్నారు. అయితే ఈ అంశాలు మాత్రమే అభ్యర్థిత్వాన్ని ఖరారు చేయవు. పార్టీ అధిష్ఠానం నిర్ణయం, స్థానిక నాయకత్వ అభిప్రాయాలు, ఎన్నికల వ్యూహం, సంస్థాగత సమీకరణాలు, చట్టపరమైన అర్హతలు వంటి అంశాలన్నీ తుది నిర్ణయంపై ప్రభావం చూపనున్నాయి.మరోవైపు మేయర్ అభ్యర్థిత్వం కోసం పార్టీలో ఇతర మహిళా నాయకుల పేర్లు కూడా పరిశీలనలోకి వచ్చే అవకాశం లేకపోలేదు. ఈ నేపథ్యంలో సంధ్యారాణి పేరు తెరపైకి రావడం పార్టీ అంతర్గత చర్చల్లో కొత్త కోణాన్ని జోడించినప్పటికీ, ఆమెకు అభ్యర్థిత్వం ఖరారవుతుందా లేదా అన్నది ఇప్పుడే చెప్పలేని పరిస్థితి.

**అసలు ప్రశ్న ఏమిటంటే..:**

విశాఖలోని ముఖ్య నాయకులకు సంధ్యారాణి పేరును పరిశీలించాలంటూ అధిష్ఠానం నుంచి వచ్చినట్లు చెబుతున్న సంకేతాలు చివరకు అధికారిక నిర్ణయంగా మారతాయా? జీవీ రామచంద్రరావు రాజకీయ అనుభవం, కుటుంబానికి ఉన్న సామాజిక పరిచయాలు సంధ్యారాణి అభ్యర్థిత్వానికి ఎంతవరకు ఉపయోగపడతాయి? వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ స్థానిక నాయకత్వం ఆమె పేరుపై ఏకాభిప్రాయానికి వస్తుందా? ఇలాంటి ప్రశ్నలకు సమాధానాలు రాబోయే రాజకీయ పరిణామాల్లో లభించనున్నాయి. మొత్తానికి జీవీఎంసీ మేయర్ పీఠం చుట్టూ కొత్త రాజకీయ లెక్కలు మొదలయ్యాయి. జనరల్ మహిళా రిజర్వేషన్ నేపథ్యంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి జీవీ రామచంద్రరావు సతీమణి సంధ్యారాణి పేరు వినిపించడం విశాఖ రాజకీయాల్లో ఆసక్తికర పరిణామంగా మారింది. అధిష్ఠానం నుంచి సంకేతాలు అందినట్లు జరుగుతున్న ప్రచారం ఎంతవరకు కార్యరూపం దాలుస్తుందో వేచి చూడాలి. అప్పటివరకు సంధ్యారాణి పేరు మేయర్ రేసులో రాజకీయ చర్చకు కేంద్రబిందువుగా నిలిచే అవకాశముంది.



# ప్రపంచకప్ జట్టులో కోహ్లీ, రోహిత్.. బీసీసీఐ రెండు కండిషన్లు

- ఆటగాళ్ల ఎంపికలో వయసు కంటే ఫిట్‌నెస్, ప్రదర్శనే ముఖ్యమన్న బీసీసీఐ అధ్యక్షుడు
- తుది నిర్ణయం సెలెక్టర్లు, కోచ్‌లదేనని స్పష్టీకరణ
- గిల్‌కు సీనియర్ల అనుభవం ఉపయోగపడుతుందన్న మన్హాస్
- బౌలింగ్ బాధ్యతల్లో బుమ్రా కీలకంగా మారగలడని వ్యాఖ్య
- ప్రపంచకప్ విజయానికి బౌలింగ్, ఫీల్డింగ్ కీలకమని కైఫ్ స్పష్టీకరణ



2027 వన్డే ప్రపంచకప్‌లో విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ ఆడతారా? వయసు మీద పడుతున్న నేపథ్యంలో ఈ ఇద్దరు సీనియర్ల ఎంపికపై కొంతకాలంగా చర్చ సాగుతోంది. అయితే, వయసు ఒక్కటే ఆటగాడి ఎంపికకు ప్రాతిపదిక కాకూడదని బీసీసీఐ అధ్యక్షుడు మిథున్ మన్హాస్ స్పష్టం చేశారు. ఫిట్‌నెస్, ప్రదర్శనే కీలకమని పేర్కొన్నారు. వచ్చే ఏడాది దక్షిణాఫ్రికా, జింబాబ్వే, నమీబియా వేదికలుగా ప్రపంచకప్ జరగనున్న విషయం తెలిసిందే.

**ఫిట్‌నెస్, ప్రదర్శనకే ప్రాధాన్యం**

ప్రపంచకప్ జట్టు ఎంపికపై బీసీసీఐ నేరుగా వ్యాఖ్యానించలేదని మన్హాస్ తెలిపారు. తుది నిర్ణయం సెలెక్టర్లు, కోచ్‌లదేనని చెప్పారు. అయితే, తన అభిప్రాయం ప్రకారం ఆటగాడి ఫిట్‌నెస్, మైదానంలో ప్రదర్శనే ఎంపికకు ప్రామాణికాలని స్పష్టం చేశారు. జట్టు కోసం ఆడుతూ విజయాలు అందించే సత్తా ఉంటే వయసును అడ్డంకిగా చూడకూడదని అభిప్రాయపడ్డారు.

**గిల్‌కు సీనియర్ల అండ**

వన్డే కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌కు కోహ్లీ, రోహిత్, హార్దిక్ పాండ్యా వంటి అనుభవజ్ఞుల సహకారం ఎంతో ఉపయోగపడుతుందని మన్హాస్ అన్నారు. జస్‌ప్రీత్ బుమ్రా

వంటి ఆటగాళ్లు బౌలింగ్ విభాగానికి నాయకత్వం వహించగలరని పేర్కొన్నారు. బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్ బాధ్యతలను సమర్థంగా పంచుకోవడం జట్టుకు మేలు చేస్తుందని చెప్పారు. ఒత్తిడిలో కీలక సందర్భాల్లో సత్తా చాటిన ఆటగాళ్లు జట్టులో ఉండటం మంచి కలయిక అని అభిప్రాయపడ్డారు.

**బౌలింగ్, ఫీల్డింగే కీలకం: కైఫ్**

మాజీ భారత బ్యాటర్ మహమ్మద్ కైఫ్ సైతం ప్రపంచకప్‌పై తన అభిప్రాయాలను వెల్లడించారు. దక్షిణాఫ్రికాలో పిచ్‌లు గతంతో పోలిస్తే బ్యాటింగ్‌కు అనుకూలంగా మారాయని చెప్పారు. ఈ నేపథ్యంలో బౌలింగ్ విభాగం నాణ్యతే విజయాన్ని నిర్ణయిస్తుందని పేర్కొన్నారు. భారత్ ప్రపంచకప్ గెలవాలంటే బౌలింగ్, ఫీల్డింగ్ విభాగాలను పటిష్ఠం చేసుకోవాలని సూచించారు. కోహ్లీ, రోహిత్ విషయంలో ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అభిప్రాయపడ్డారు.

# ఆస్ట్రేలియా చేతిలో సౌతాఫ్రికా ఓటమి.. WTC ఫైనల్ రేసులో భారత్‌కు కలిసొచ్చే అంశాలివే!

దక్షిణాఫ్రికా పర్యటనను ఆస్ట్రేలియా జట్టు అద్భుత విజయంతో ప్రారంభించింది. దర్బన్ వేదికగా కింగ్స్‌మీడ్ మైదానంలో (2026 అక్టోబర్ 13, మంగళవారం) ముగిసిన తొలి టెస్టులో ఆస్ట్రేలియా ఘన విజయం సాధించింది. మాట్ రెన్‌షా సెంచరీతో పాటు హాఫ్ సెంచరీతో అదరగొట్టగా.. స్టార్ పేసర్ జోష్ హాజిల్‌వుడ్ ఏకంగా 6 వికెట్ల హాల్‌తో చెలరేగి సౌతాఫ్రికా పతనాన్ని శాసించాడు. ఈ విజయంతో ఆస్ట్రేలియా ఐసీసీ వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ (WTC 2025-27) పట్టికలో తన అగ్రస్థానాన్ని మరింత పటిష్టం చేసుకుంది.

**ఆస్ట్రేలియా విజయం భారత్‌కు కలిసొచ్చేనా?:**

దర్బన్ టెస్టులో సౌతాఫ్రికా ఓటమితో టీమిండియా శిబిరంలో కొంత ఊరట లభించింది. ప్రొటీస్ జట్టు ఓడిపోవడంతో వారి విజయాల శాతం (PCT) దెబ్బతిని 60 శాతానికి పడిపోయింది. సొంతగడ్డపై ప్రొటీస్ తో జరిగిన టెస్ట్ సిరీస్‌లో ఎదురైన పరాజయంతో భారత్ కష్టాల్లో పడిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఔజ ఫైనల్ రేసులో నిలవాలంటే టీమిండియాకు ప్రతీ మ్యాచ్ ఎంతో కీలకం కానుంది. చిన్న పొరపాటు జరిగినా ఫైనల్ వెళ్లే అవకాశాలు గల్లంతయ్యే ప్రమాదం ఉంది.

భారత్ ఆడే నెక్స్ట్ మ్యాచ్‌లు:







ప్రస్తుత డబ్ల్యూటీసీ సైకిల్‌లో టీమిండియా ఇంకా 7 టెస్ట్ మ్యాచ్‌లు ఆడాల్సి ఉంది.

**న్యూజిలాండ్‌తో వారి గడ్డపై 2 టెస్టులు**

బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో భాగంగా ఆస్ట్రేలియాతో స్వదేశంలో 5 టెస్టులు

కొలంబోలో మ్యాచ్‌ను డ్రా చేసుకున్న శుభ్?మన్ గిల్ నేతృత్వంలోని భారత్.. ఇకపై జరిగే ప్రతి మ్యాచ్‌లోనూ విజయం సాధించడంపై దృష్టి పెట్టాలి.. ఒకవేళ ఇండియా తన తదుపరి సిరీస్‌లలో న్యూజిలాండ్, ఆస్ట్రేలియాలపై విజయాలు సాధిస్తే.. డైరెక్టుగా టాప్-2లోకి దూసుకెళ్లే అవకాశం ఉంది.

ఆస్ట్రేలియా: ప్యాట్ కమ్మిన్స్ సేన 11 మ్యాచ్‌లలో 108 పాయింట్లతో, 81.82 శాతంతో అగ్రస్థానంలో కొనసాగుతోంది.

న్యూజిలాండ్: 72.22 శాతంతో రెండో స్థానంలో ఉంది.

భారత్: ప్రస్తుతం 51.52 శాతంతో ఐదో స్థానంలో ఉంది.

సౌతాఫ్రికా తాజా ఓటమితో 60 శాతానికి పడిపోయింది. సౌతాఫ్రికాకు ఆస్ట్రేలియాతో మరో 2 టెస్టులు, అలాగే బంగ్లాదేశ్, ఇంగ్లండ్‌లతో సిరీస్‌లు మిగిలి ఉన్నాయి. బంగ్లాదేశ్ కూడా రేసులో ఉండటంతో డబ్ల్యూటీసీ ఫైనల్ పోరు రసవత్తరంగా మారింది.

## ఉప్పల్‌లో ఇక ఫ్లాట్ పిచ్ కాదు: విండీస్‌ను ఢీ కొట్టేందుకు బిగ్ ప్లాన్: తిలక్ వర్మ కామెంట్స్ వైరల్

హైదరాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం (ఉప్పల్) వేదికగా వెస్టిండీస్‌తో రేపు (అక్టోబర్ 14, 2026, బుధవారం) జరగనున్న నాలుగో టీ20 మ్యాచ్‌కు ముందు టీమిండియా స్టార్ మిడిల్ ఆర్డర్ బ్యాటర్, లోకల్ బాయ్ తిలక్ వర్మ (౧అశ్రీఖ౧ ఖుతీఖు) విలేకరుల సమావేశంలో మాట్లాడాడు. సొంతగడ్డపై మ్యాచ్ ఆడటం, పిచ్ పరిస్థితులు, తన బ్యాటింగ్ స్థానం, మూడో టీ20లో జరిగిన విచిత్రమైన రనౌట్ ఘటనపై తిలక్ పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నాడు.

**పిచ్ ఎలా స్పందిస్తుందో చూడాలి:**

ఉప్పల్ గ్రౌండ్‌లో సాధారణంగా ఫ్లాట్ వికెట్ ఉంటుందని, అయితే ఈసారి పిచ్ స్వభావాన్ని మార్చారని ప్రచారం జరుగుతోందని తిలక్ వర్మ తెలిపాడు. కానీ ఈసారి పిచ్‌లో మార్పులు చేశామని చెబుతున్నారు. రేపటి మ్యాచ్‌లో పిచ్ ఎలా ప్రవర్తిస్తుందో చూడాల్సి ఉంది. ప్రస్తుతం మేం బ్యాటింగ్, బౌలింగ్ రెండింటిలోనూ ఎంతో అగ్రెసివ్‌గా ఆడుతున్నాం.. నాకు, ఇషాన్ కిషన్, అభిషేక్ శర్మ, నితీష్ కుమార్ రెడ్డిలకు హైదరాబాద్ ఉప్పల్ మైదానంలో ఎన్నో





(ఐపీఎల్ సన్‌రైజర్స్ అనుభవం) మ్యాచుల ఆడాం.. ఇది ఖచ్చితంగా మా టీమ్‌కు చాలా ప్లస్ అవుతుందని స్పష్టం చేశాడు.

**ఆ స్థానంలో బ్యాటింగ్ చేయాలని ఉంది:**

తన బ్యాటింగ్ పొజిషన్ గురించి తిలక్ వర్మ మరోసారి క్లారిటీ ఇచ్చాడు. నాకు వ్యక్తిగతంగా నెంబర్ 3 పొజిషన్‌లో బ్యాటింగ్ చేయడం చాలా ఇష్టం.. కానీ ప్రస్తుతం జట్టుకు మిడిల్ ఆర్డర్‌లో నా అవసరం ఉంది. అందుకే టీమ్ మేనేజ్‌మెంట్ ఆదేశాల మేరకు మిడిల్ ఆర్డర్‌లో బ్యాటింగ్‌కు వస్తున్నాను అని తెలిపాడు.

**మూడో టీ20లో దురదృష్టకర రనౌట్:**

ఇండోర్‌లో జరిగిన మూడో టీ20లో తాను రనౌట్ అయిన తీరుపై తిలక్ వర్మ స్పందిస్తూ.. గత మ్యాచ్‌లో నేను అలా రనౌట్ అవ్వడం నిజంగా దురదృష్టకరం. నేను కొట్టిన షాట్ బౌండరీకి వెళ్లిపోయిందని అనుకున్నాను.. మైదానంలో ఉన్న హోర్డింగ్ ఫ్లాష్ కావడం వల్ల బాల్ ఫోర్ వెళ్ళిందేమో అని పొరబడ్డాను అని విచారం వ్యక్తం చేశాడు. ఈ అనుభవం నుంచి ఒక పాఠం నేర్చుకున్నాను. ఇక నుంచి ఆన్-ఫీల్డ్ అంపైర్ అధికారికంగా ఫోర్ (ఫ్రీశబతీ) సిగ్నల్ ఇచ్చే వరకు రన్ తీస్తూనే ఉంటాను అని నవ్వుతూ చెప్పుకొచ్చాడు.

**వెస్టిండీస్‌తో పోరుపై పర్ఫెక్ట్ ప్లానింగ్:**

ప్రత్యర్థి వెస్టిండీస్ జట్టు ప్రమాదకరమైనదని తిలక్ వర్మ వ్యాఖ్యానించాడు. టీ20 క్రికెట్‌లో విండీస్ చాలా బలమైన జట్టు.. వారి టీమ్‌లో చివరి ప్లేయర్ వరకు హార్డ్ హిట్టింగ్ చేయగల సామర్థ్యం ఉంది.. కాబట్టి కరేబియన్ జట్టుని తక్కువ అంచనా వేయకుండా పర్ఫెక్ట్ ప్లాన్‌తో మైదానంలోకి దిగుతామని పేర్కొన్నాడు.




# తెలుగు ఇండస్ట్రీ లో ఈ జనరేషన్ 'టార్చ్ బేరర్లు వీళ్లే?



తెలుగు సినిమా ఇండస్ట్రీ కొత్త పుంతలు తొక్కుతూ ముందుకు సాగుతుంది. సినిమాలను తీయడం ఒక ఆర్ట్. అనుకున్నది అనుకున్నట్టుగా విజువలైజ్ చేసి విజయం సాధించిన దర్శకుడికి దక్కే గౌరవం ప్రత్యేకమైనది. ట్రెండ్ సెట్ చేసిన దర్శకుడిని అనుకరిస్తూ కొంతమంది డైరెక్టర్స్ అదే బాటలో నడుస్తుంటారు. ఒక రంగంలో వైవిధ్యాన్ని ప్రదర్శిస్తూ, ఫ్రెష్ థాట్ ని ముందుకు తీసుకెళ్లే వాళ్ళని 'టార్చ్ బేరర్' అంటారు...'అరవింద సమేత' మూవీలో చెప్పినట్టుగా ప్రతి 30 సంవత్సరాలకు ఒకసారి బతుకు తాలుకు ఆలోచనలు మారుతుంటాయి. అలాగే సినిమా ఇండస్ట్రీలో కొన్ని సంవత్సరాలకు ఒకసారి సినిమాలు తీసే దర్శకుల ఆలోచన శైలి మారుతుంది. అలాగే సినిమాలు చూసే ప్రేక్షకుడి దృష్టి మారుతుంది. డిఫరెంట్ సబ్జెక్టులతో వచ్చే మూవీస్ ని ప్రేక్షకులు ఆదరిస్తూ ఉంటారు. ప్రస్తుతం ఈ జనరేషన్ లో తెలుగు సినిమా ఇండస్ట్రీని ముందుకు తీసుకెళ్లే దర్శకులలో ముగ్గురుని 'టార్చ్ బేరర్లు' గా చెప్పుకోవచ్చు వాళ్ళెవరంటే.

**రాజమౌళి**

వైవిధ్యమైన కథాంశాలను ఎంచుకుంటూ ఎమోషనల్ సన్నివేశాలను ప్రేక్షకుల హృదయాలకు హత్తుకునేలా తెరక్కించడం లో రాజమౌళి సిద్ధహస్తుడు. విఎఫ్ఎక్స్ కి ప్రాధాన్యమున్న సినిమాలను తీయడం మనవల్ల కాదని భ్రమ పడిన వాళ్లందరికీ షాకిస్తూ హాలీవుడ్ ఇండస్ట్రీని మెప్పించేలా సినిమాలను తీసి సక్సెస్ లను సాధించాడు. సినిమా సినిమాకు తన పరిధిని విస్తరించుకుంటూ ప్రస్తుతం పాన్ వరల్డ్ స్థాయికి చేరుకున్నాడు. ఒకప్పుడు తెలుగు సినిమా ఇండస్ట్రీని పక్క ఇండస్ట్రీ వాళ్లే పట్టించుకునే వారు కాదు. అలాంటిది ఇప్పుడు ప్రపంచ స్థాయి దర్శకులు సైతం మన గురించి మాట్లాడుకుంటున్నారు అంటే అది రాజమౌళి వల్లే సాధ్యమైంది...

**సుకుమార్**

మూస ధోరణిలో వెళ్తున్న సినిమాలకు స్వస్తి చెప్పి డిఫరెంట్ కథలను ట్రై చేసి, ప్రేక్షకుడి దృష్టి మార్చేసిన దర్శకుడు సుకుమార్...ఆడియన్స్ అభిరుచి కి అనుగుణంగా సినిమాలను చేస్తూ, కథల విషయంలో చాలా కేర్ తీసుకొని, స్క్రీన్ ప్లే ని అత్యుత్తమంగా ప్రజెంట్ చేశాడు. సుకుమార్ చేసిన ప్రయోగాలు కొన్ని విఫలమై ఉండొచ్చు. కానీ సినిమాను మాత్రం కొత్తగా ప్రజెంట్ చేయడంలో ఆయన ఎప్పుడు ఫెయిల్ అవ్వలేదు...

**సందీప్ రెడ్డి వంగ**

'అర్జున్ రెడ్డి' సినిమాతో ప్రేక్షకుడి ఆలోచన ధోరణిని మార్చేసిన దర్శకుడు సందీప్ రెడ్డి వంగా... బోల్డ్ కంటెంట్ తో సినిమాని చేసి నెక్స్ట్ లెవెల్ సక్సెస్ ను సాధించవచ్చని ప్రూవ్ చేశాడు... సినిమా మ్యూజిక్, నేపథ్య సంగీతం, సౌండ్ ఎఫెక్ట్స్ ను కొత్తగా ప్రజెంట్ చేసిన దర్శకుడు సందీప్... అర్జున్ రెడ్డి, అనిమల్ రెండు సినిమాలతో ప్రేక్షకుల దృష్టి కోణాన్ని మార్చేశాడు. హీరో అంటే రాముడు మంచి బాలుడు గా ఉండాలని అలా ఉంటేనే ప్రేక్షకులు ఆదరిస్తారని నమ్మే వాళ్ల నమ్మకాన్ని పటాపంచలు చేశాడు. హీరో అంటే సాధారణ మనిషి మాత్రమే. ఆయనలో పాజిటివ్ లతో పాటు నెగెటివిటీస్ కూడా ఉంటాయని చూపించాడు. అందుకే సందీప్ సైతం టార్చ్ బేరర్ గా నిలిచాడు...

ఈ ముగ్గురు దర్శకులు హిట్ సినిమాలను ఇస్తూనే తర్వాతి తరంలో వచ్చే మేకర్స్ కి ధైర్యాన్ని ఇచ్చారు. అందుకే వీళ్లు నిజమైన 'టార్చ్ బేరర్లు' అయ్యారు...




Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, ONGOLE MANDAL, prakasam district, Andhrapradesh-523001. and published at D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, ONGOLE MANDAL, prakasam district, Andhrapradesh-523001. Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/25/A2230, editorpenpower@gmail.com